



Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 45 | గురువారం 10 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## ముఖ్యమంత్రి మార్పుపై
# ఊహాగానాలు..

- ప్రియాంక గాంధీతో డీకే శివకుమార్ కీలక భేటీ
- ఢిల్లీలో కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీతో సమావేశమైన డీకే శివకుమార్
- కర్ణాటక ముఖ్యమంత్రి మార్పుపై మళ్లీ పందుకున్న ఊహాగానాలు
- ప్రియాంక గాంధీతో భేటీ అనంతరం మాట్లాడకుండా వెళ్లిన శివకుమార్
- త్వరలో అధిష్టానంతో సిద్ధరామయ్య కూడా భేటీ అయ్యే అవకాశం

2లో

## ఎస్ఐఆర్
# ప్రజాస్వామ్యానికి ప్రమాదం

- ఓటర్ల జాబితా ప్రత్యేక సమీక్ష నిలిపివేయాల్సిందే
- రాహుల్, తేజస్వి, ఎంఎ బేబి
- బీహార్‌లో పెల్లుబికిన ప్రజాగ్రహం
- సార్వత్రిక సమ్మెకు ప్రతిపక్షాల మద్దతు
- రహదారుల దిగ్బంధనంతో స్తంభించిన జన జీవనం



**పాట్నా - సూర్య వాస్తవం, జూలై 9:**

రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ ఓటర్ల జాబితా ప్రత్యేక సమీక్ష (ఎస్ఐఆర్) పేరుతో ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రక్రియ పట్ల రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నిరసనలు వెల్లువెత్తాయి. దేశవ్యాప్తంగా నిర్వహించిన సార్వత్రిక సమ్మెకు ప్రతిపక్షాలు మద్దతు తెలిపాయి. ఈ నేపథ్యంలో ప్రజల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వున్న ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. ప్రతిపక్షాలు పిలుపిచ్చిన 'చక్కా జామ్' నిరసనతో రాష్ట్రం స్తంభించింది. రాష్ట్రవ్యాప్తంగా రైళ్లు, బస్సులు, ట్రక్కులు, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. ప్రతిపక్ష పార్టీలైన ఆర్‌జెడి, కాంగ్రెస్, వామపక్షాలకు చెందిన వేలాదిమంది కార్యకర్తలు, మద్దతుదారులు రాజధాని పాట్నా వీధుల్లోకి వచ్చారు. ప్రత్యేక సమగ్ర సవరణ

- మిగతా 2లో..



## ప్రధానమంత్రి నరేంద్రమోదీకి
# నమీబియా అత్యున్నత పురస్కారం

- అవార్డును ప్రదానం చేసిన నమీబియా అధ్యక్షురాలు నెతుంబో నంది-ద్వైత్వా
- ఈ గౌరవం పొందిన తొలి భారత నేతగా మోదీ రికార్డు
- 2014 నుంచి మోదీకి ఇది 27వ అంతర్జాతీయ పురస్కారం
- ఆరోగ్యం, ఇంధన రంగాల్లో ఇరు దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు
- ప్రస్తుత పర్యటనలో నాలుగు దేశాల నుంచి అత్యున్నత గౌరవాలు

**నమీబియా- సూర్య వాస్తవం, జూలై 9:**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ పురస్కారాన్ని చేర్చుకున్నారు. ఐదు దేశాల పర్యటనలో చివరిగా నమీబియాకు చేరుకున్న ఆయన, ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్‌విట్షియా మిరాబిలిస్'ను అందుకున్నారు. బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో నమీబియా అధ్యక్షురాలు నెతుంబో నంది-ద్వైత్వా ఈ గౌరవాన్ని ప్రధాని మోదీకి అందజేశారు.

- మిగతా 2లో..



## మామిడి రైతులను
# ఆదుకోవడంలో విఫలం

- రాష్ట్ర ప్రభుత్వంపై జగన్ ఆగ్రహం
- పోలీసుల ఆంక్షలు, ఉద్రిక్తతల నడుమ బంగారుపాళ్యం పర్యటన
- తోపులాట, గందరగోళం

**చిత్తూరు- సూర్య వాస్తవం, జూలై 9:**

మామిడి రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. మామిడిని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మామిడి రైతుల కష్టాలను తెలుసుకోవడానికి చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం యార్డుకు బుధవారం ఆయన వచ్చారు. జగన్ పర్యటన ఆద్యంతం ఉద్రిక్తత, నిర్బంధాల నడుమ సాగింది. ఆయన షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి గత అనుభవాల దృష్ట్యా అధికార యంత్రాంగం అలర్ట్ అయ్యింది. భద్రతా కారణాల పేరిట 500 మంది కంటే ఎక్కువమంది పార్టీ శ్రేణులు రావడానికి వీల్లేదంటూ ఎస్‌పి ఆంక్షలు విధించారు. రోడ్డు షోకు అనుమతి ఇవ్వలేదు. అయితే, ఉమ్మడి చిత్తూరు జిల్లాతోపాటు, కడప జిల్లాలోని పార్టీ నాయకులూ

- మిగతా 2లో..

# మరింతగా భూ సేకరణ

- రెండేళ్లలో పలు సంస్థలకు పందేరం
- స్పేస్ పాలసీకి ఆమోదం
- మంత్రి మండలి నిర్ణయం

**అమరావతి - సూర్య వాస్తవం, జూలై 9:**

రైతాంగం నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ రాష్ట్రంలో భూ సేకరణ ప్రక్రియ మాత్రం ఆగడం లేదు. రానున్న రెండేళ్ల కాలంలో మరింతగా భూములను సేకరించి వివిధ సంస్థలకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఈ దిశలో పలు నిర్ణయాలను తీసుకున్నారు. రామాయపట్నం పోర్టు రెండోదశ, బిపిసిఎల్ పెట్రోలియం, రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ప్రాజెక్టు, ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్, ఇంటిగ్రేటెడ్ సోలార్‌సెల్ మాన్యుఫాక్చరింగ్ ప్రాజెక్టులతో పాటు వివిధ పారిశ్రామిక టౌన్‌షిప్ ప్రాజెక్టులకు రానున్న రెండేళ్లలో భూములు సేకరించి ఇవ్వాలన్న ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు నెల్లూరు జిల్లాలో కందుకూరు, కావలిలో ఒక స్పెషల్ కలెక్టర్ యూనిట్, 5 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యూనిట్లను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది. మంత్రి వర్గంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారధి మీడియాకు వెల్లడించారు.



**అమరావతిలో భూ కేటాయింపుల సమీక్ష**

అమరావతిలో భూమి కేటాయింపు నిబంధనలు -2017, భూమి కేటాయింపు నియంత్రణలు2017 ప్రకారం సిఆర్‌డిఎ ప్రాంతంలో వివిధ సంస్థలకు భూమి కేటాయింపులను సమీక్షించే ప్రతిపాదనకు మంత్రి మండలి గ్రీన్‌సిగల్ ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. రాజధాని ప్రాంతంలో ఇప్పటికే ఆరు కేంద్రప్రభుత్వ రంగ సంస్థలకు కేటాయించిన 34.59 ఎకరాలను 33.39 ఎకరాలకు కుదించడం, నిర్మాణాలకు ముందుకు రాని గెయిల్, అంబికా సంస్థలకు కేటాయించిన భూములను రద్దు చేసేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపినట్లు ఆయన చెప్పారు. అమరావతి నేలపాడులో నిర్మాణంలో ఉన్న శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులతో పాటు ఆల్‌ఇండియా సర్వీసెస్ అధికారుల నివాస సముదాయాల పనులు వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు, దీనికోసం రూ.524.70 కోట్ల నిధులు మంజూరుకు ఆమోదం చెప్పినట్లు మంత్రి తెలిపారు. రాజధాని నగరానికి అవసరమైన భూములను సిఆర్‌డిఎ సేకరించడంతో జీవనోపాధికోల్పోయిన 1575 కుటుంబాలను ప్రత్యేక కేసుగా పరిగణిస్తూ పింఛన్ ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి చెప్పారు. కుప్పం విమానాశ్రయానికి వయబిలిటి గ్యాఫ్ ఫండింగ్ సపోర్టుతోపాటు దగదర్తి, శ్రీకాకుళం, అమరావతి విమానాశ్రయాల అభివృద్ధికి నిధుల కోసం రూ.వెయ్యి కోట్లను హడ్కో నుంచి రుణం తీసుకునేందుకు

- మిగతా 2లో..




## రేషన్ బియ్యం
# అక్రమార్కులపై ఉక్కుపాదం

- మంత్రి మనోహర్ కీలక ఆదేశాలు
- రాష్ట్రం నుంచి బియ్యం ఎగుమతులకు ఎలాంటి అభ్యంతరం లేదు
- రేషన్ బియ్యాన్ని కలిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- అక్రమార్కులపై పీడీ యాక్ట్, బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు
- కాకినాడ, విశాఖ, నెల్లూరు పోర్టుల వద్ద 24/7 చెక్ పోస్టులతో నిఘా
- జాతీయ రహదారులపైనా తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశం
- విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు పెంచాలని మంత్రి సూచన



**అమరావతి- సూర్య వాస్తవం, జూలై 9:**

రాష్ట్రంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపనుంది. పేదల కోసం ఉద్దేశించిన సబ్సిడీ బియ్యాన్ని అక్రమంగా ఎగుమతి చేసే వారిపై పీడీ యాక్ట్, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)

- మిగతా 2లో..

## పక్కా ప్రణాళికతోనే
# జగన్ పర్యటనలు..

- శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు యత్నిస్తున్నారన్న అచ్చెన్నాయుడు
- ఐదారు జిల్లాల నుంచి జనాలను తరలించడం ఎందుకని ప్రశ్న
- పథకం ప్రకారమే రోడ్లపై మామాడి పండ్లు పోశారని విమర్శ

**అమరావతి- సూర్య వాస్తవం, జూలై 9:**

వైసీపీ అధినేత జగన్ చేపడుతున్న పర్యటనలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రైతుల సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన జగన్‌కు



లేదని, కేవలం రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకే పక్కా ప్రణాళికతో యాత్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బుధవారం కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్‌తో కలిసి

- మిగతా 2లో..

# ప్రధానమంత్రి నరేంద్రమోదీకి నమీబియా అత్యున్నత పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఈ పురస్కారం పొందిన తొలి భారతీయ నేతగా ప్రధాని మోదీ నిలవడం గమనార్హం. 2014లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయన అందుకున్న 27వ అంతర్జాతీయ పురస్కారం ఇది. ప్రధానమంత్రి హోదాలో నరేంద్ర మోదీ నమీబియాలో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ పర్యటన సందర్భంగా ఆయన ఆ దేశ అధ్యక్షురాలితో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ఆరోగ్య సంరక్షణ, ఇంధనం వంటి కీలక రంగాల్లో సహకారం కోసం నాలుగు ఒప్పందాలపై సంతకాలు చేశారు. కాగా, నమీబియాలో పర్యటించిన మూడో భారత ప్రధానిగా మోదీ నిలిచారు. ఈ నెల 2న ప్రారంభమైన ప్రధాని ఐదు దేశాల పర్యటనలో భాగంగా ఇప్పటికే ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్ దేశాలను సందర్శించారు. బ్రెజిల్‌లోని రియోలో జరిగిన బ్రిక్స్ సదస్సులో కూడా పాల్గొన్నారు. ఈ పర్యటనలో అర్జెంటీనా మినహా మిగిలిన నాలుగు దేశాల అత్యున్నత పురస్కారాలను అందుకోవడం విశేషం.

# ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు..

**కర్ణాటక – సూర్య వాస్తవం, జూలై 9**

కర్ణాటక రాజకీయాల్లో ముఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి చర్చనీయాంశమైంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బుధవారం ఢిల్లీలో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీతో సమావేశం కావడంతో ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరినట్లయింది. ముఖ్యమంత్రి పదవి విషయంలో గత కొంతకాలంగా కొనసాగుతున్న ఉత్కంఠ ఈ భేటీతో తారాస్థాయికి చేరింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవిపై సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌ల మధ్య ఒప్పందం జరిగిందనే ప్రచారం బలంగా ఉంది. దీని ప్రకారం, తొలి రెండున్నరేళ్లు సిద్ధరామయ్య, ఆ తర్వాత మిగిలిన కాలానికి డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ఒప్పందం ప్రకారమే త్వరలో డీకే ముఖ్యమంత్రి అవుతారని ఆయన వర్గం ఎమ్మెల్యేలు, మద్దతుదారులు బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి కావాలనే తన ఆశను శివకుమార్ కూడా దాచుకోవడం లేదు. ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, "పదవిని ఆశించడంలో తప్పేముంది?" అంటూ తన మనసులోని మాటను పరోక్షంగా బయటపెట్టారు. అయితే, ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాత్రం తాను ఐదేళ్ల పూర్తికాలం పదవిలో కొనసాగుతానని ధీమాగా చెబుతున్నారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రియాంక గాంధీతో డీకే శివకుమార్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు. త్వరలోనే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా కాంగ్రెస్ అధిష్ఠానంతో సమావేశమయ్యే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# రేషన్ బియ్యం అక్రమార్కులపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

సెక్షన్ల కింద కఠిన కేసులు నమోదు చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అయితే, నిబంధనలు పాటిస్తూ చేసే చట్టబద్ధమైన బియ్యం ఎగుమతులకు తమ ప్రభుత్వం వ్యతిరేకం కాదని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో కాకినాడ, విశాఖపట్నం, నెల్లూరు జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి మనోహర్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎగుమతి చేసే బియ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ పీడీఎస్ బియ్యం కలవకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తేల్చిచెప్పారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్రంలోని కీలకమైన కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం (నెల్లూరు) పోర్టుల వద్ద 24/7 పనిచేసేలా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరాన్ని బట్టి మరిన్ని చెక్‌పోస్టులను పెంచాలని సూచించారు. కాకినాడ పోర్టులో నియంత్రణ మెరుగ్గా ఉందని, ఇదే తరహా పటిష్ఠమైన నిఘాను విశాఖ, నెల్లూరు పోర్టుల వద్ద కూడా అమలు చేయాలన్నారు. జాతీయ రహదారులపై కూడా అనుమానం ఉన్నచోట తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి నిఘా ముమ్మరం చేయాలని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమ రవాణాపై ఇప్పటికే కేసులు నమోదవుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. కాకినాడ జిల్లాలో 85, విశాఖపట్నంలో 92, నెల్లూరు జిల్లాలో 62 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీటిలో పోర్టు ప్రాంతాలకు సంబంధించిన కేసులు కూడా ఉన్నాయని పేర్కొన్నారు.

# పక్కా ప్రణాళికతోనే జగన్ పర్యటనలు..

(మొదటి పేజీ తరువాయి)

అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. జగన్ పర్యటనలు సినిమా సెట్టింగుల్లా ఉన్నాయని అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. "పరామర్శకు వెళ్తే రైతులను కలిసి మాట్లాడాలి కానీ, ఐదారు జిల్లాల నుంచి జనాన్ని తరలించడం ఎందుకు? ముందుగా వేసుకున్న పథకం ప్రకారమే రోడ్లపై మామిడి పండ్లను పోశారు. ఇది క్రిమినల్ మైండ్‌తో చేసే పని" అని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలాంటి చర్యలతో సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. తోతాపురి మామిడి రైతుల సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించిందని అచ్చెన్నాయుడు తెలిపారు. ఈసారి 7 లక్షల మెట్రిక్ టన్నుల బంపర్ క్రాప్ రావడం, పల్ప్ పరిశ్రమల వద్ద గతేడాది నిల్వలు ఉండటంతో ధర పడిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో, పరిశ్రమలతో మాట్లాడి కిలో మామిడిని రూ.8కి కొనేలా ఒప్పించామని, ప్రభుత్వం తరఫున కిలోకు రూ.4 చొప్పున సాయం అందిస్తున్నామని వివరించారు. ఇప్పటికే అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతులను ఆదుకుంటున్న తర్వాత కూడా జగన్ పర్యటనలు చేయడం వెనుక దురుద్దేశం ఉందని అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేయాలన్నదే ఆయన లక్ష్యంగా కనిపిస్తోందని విమర్శించారు.

# కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు మానుకోవాలి

**- తులసి రెడ్డి......**

**వేంపల్లి – సూర్య వాస్తవం, జూలై 9:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక,కర్షక విధానాలకు నిరసనగా వామ పక్షాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జరుగుచున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా ఏఐటియుసి ఆధ్వర్యంలో కడప జిల్లా, వేంపల్లిలో ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్మికులు,కర్షకులు సమాజానికి వెన్నెముక లాంటి వారిని, వీరి శ్రమను దోచుకోవడం అన్యాయమని తులసి రెడ్డి అన్నారు.ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక,కర్షక వ్యతిరేక విధానాలను మానుకోవాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.ధర్నా కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంకట్రాముడు, బ్రహ్మం, ఆంజ నేయులు, బాదుల్లా, బాలాజీ, బుజ్జి, ప్రసాద్, చిన్న, కాంగ్రెస్ నాయకులు అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, భాషా,చిన్న ఓబుల్ రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు రంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రజాస్వామ్యానికి ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

(ఎస్ఐఆర్) పట్ల ఆందోళన వెలిబుచ్చారు. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల నుండి కూడా వేలాదిమంది వచ్చి నిరసనల్లో పాల్గొన్నారు.

పాట్నాలో జరిగిన 'రహదారుల దిగ్బంధన' నిరసనలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్, సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపంకర్ భట్టాచార్య, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి) నేత ముకేష్ సహానీ పాల్గొ న్నారు. మహాఘట్‌బంధన్ నేతల నాయ కత్వంలో నిరసన ప్రదర్శన జరిగింది. బీహార్ ఎన్నికల కమిషనర్ కార్యాలయానికి నేతలు వెళ్తుండగా, పోలీసులు వారిని బలవంతంగా అడ్డుకోవడానికి ప్రయత్నించారు. దాంతో నేతలు అక్కడే నిరసనకారులను ఉద్దేశించి ప్రసంగించారు. పాట్నాలో రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్ కలిసి నిరసన ప్రదర్శనలో పాల్గొనడం ఇదే మొదటిసారి.

**యువత ఓటు హక్కు లాక్కునే ప్రయత్నాలు సహించం : రాహుల్**

ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ గతేడాది మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, ఇప్పుడు బీహార్‌లో కూడా అదే పరిస్థితిని పునరావృతం చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని విమర్శించారు. బిజెపి ఆదేశాల మేరకు ఎన్నికల కమిషన్ పనిచేస్తోందని అన్నారు. ఓటర్లు ముఖ్యంగా యువత ఓటు హక్కును దొంగిలించేందుకు ఇసి ప్రయత్నించడాన్ని ఎంత మాత్రమూ సహించబోమని రాహుల్ స్పష్టం చేశారు.

**మోడీని కాపాడుతున్న ఇసి : సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ**

మోడీ పాలనను కాపాడే కమిషన్‌గా ఎన్నికల కమిషన్ దిగజారిపోయిందని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ విమర్శించారు. భారత రాజకీయాల్లో కొత్త శకానికి నాంది పలికిన అనేక ఉద్యమాలకు బీహార్ నాందిపలికిందని అన్నారు. బీహార్‌లో ప్రారంభమైన నిరసనలు చాలా వరకు భారీ విజయాలు సాధించాయని గుర్తు చేశారు. కేంద్రంలో మోడీ, అమిత్ షా పాలనకు, బీహార్‌లో నితీష్ కుమార్ పాలనకు కౌంట్‌డౌన్ ప్రారంభమైందన్నారు. జర్మనీలో అడాల్ఫ్ హిట్లర్ అధికారంలోకి వచ్చిన తరువాత, అతను క్రమంగా ప్రజాస్వామ్య హక్కులను ఒక్కొక్కటిగా లాక్కున్నాడని గుర్తు చేశారు. 1935లో హిట్లర్ న్యూరెంబర్గ్ చట్టాలను ప్రవేశపెట్టాడని, ఇది యూదులను ప్రజా జీవితంలోని అన్ని అంశాల నుండి మినహాయించింద న్నారు. దీంతో, ఆ దేశం పూర్తి ఫాసిజంలోకి దిగజారిందన్నారు. బిజెపి, కేంద్ర ప్రభుత్వ చర్యల్లో హిట్లర్ పాలన నాటి సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితిలో ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడటానికి ప్రధాన ఉద్యమాలను ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. బీహార్ బంద్ మరిన్ని నిరసనలకు ఒక స్పష్టమైన పిలుపు అవుతుందని అన్నారు. హిట్లర్ పాలనలాగే బిజెపి పాలన కూడా అంతమవుతుందని చెప్పారు. ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్, ప్రజాస్వామ్యానికి వినాశనమని అన్నారు. దీనివల్ల పేదలు, సమాజంలో వెనుకబడిన వర్గాలు, బలహీన వర్గాల ఓటింగ్ హక్కులు గల్లంతవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**నిలిచిన రైళ్లు**

ప్రజల ఆందోళనలతో సుదూర ప్రాంత రైళ్లతో సహా మొత్తంగా 25కిపైగా రైళ్లు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల బంద్‌ను దృష్టిలో పెట్టుకుని ముందుగానే రైళ్లను ఆపివేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల రహదారులను దిగ్బంధించారు. పలు జాతీయ, రాష్ట్ర హైవేలపై వామపక్షాల కార్యకర్తలు బైఠాయించారు.

పాట్నా, వైశాలి, గయ, నవడా, సివాన్, అర్వాల్ జిల్లాల్లో రహదారులన్నీ ఆందోళనకారులతో నిండిపోయాయి. మొత్తంగా 38 జిల్లా ప్రధాన కేంద్రాల్లోనూ నిరసన ప్రదర్శనలు జరిగాయి. బ్లాక్, సబ్ డివిజనల్ స్థాయిల్లో కూడా ఆందోళనలు జరిగాయి. ఎన్నికల కమిషన్ కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించిన వారిని పోలీసులు అడ్డుకున్నారు.

# మరింతగా భూ సేకరణ

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి మండలి గ్రీన్ సిగల్ ఇచ్చింది.

**ఎపి బల్క్‌డ్రగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు 2001 ఎకరాల బదలాయింపు**

అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతంలో ఎపిఐఐసి ప్రతిపాదించిన బల్క్ డ్రగ్ పార్క్ సరిహద్దును మార్చేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఎఎంఎన్ఎస్ఐ ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు కేటాయించిన భూముల తరలింపుకు పరిహారంగా అదనంగా 790 ఎకరాల భూములను సేకరించడంతో పాటు మొత్తం 2001.80 ఎకరాల భూములను ఎపి బల్క్‌డ్రగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు బదిలీ చేయాలన్న ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదించింది.

**ఇవి కాక..**

రాష్ట్ర ప్రభుత్వం 2025–30 కాలానికి స్పేస్ రంగ అభివృద్ధి కోసం రూపొందించిన ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0కు పరిశ్రమలు, వాణిజ్యశాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

ఎపి మార్క్‌ఫెడ్ కు ఇప్పటికే పొందిన రూ.6,700 కోట్ల రుణంతో పాటు వెయ్యి కోట్ల అదనపు రుణాన్ని మంజూరు చేసేందుకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ నుంచి క్రెడిట్ పొందేందుకు ప్రభుత్వ హామీ పొడిగింపు.

కోకో రైతులకు మద్దతు ధరగా కిలోకు రూ.50ల చొప్పున రూ.14,884 కోట్లు మంజూరుతోపాటు ప్రస్తుత సీజన్‌లో నిర్ధేశించి అమ్ముడు పోని 2976.76 మెట్రిక్ టన్నుల కోకో గింజల టన్నులను ప్రామాణిక ఆపరేటింగ్ విధానంతో సేకరించాలని నిర్ణయం.

ప్రస్తుత సీజన్‌లో 6.50లక్షల టన్నుల తోతాపూరి మామిడిని సేకరించాలని నిర్ణయం. ఎస్ఓపి ప్రకారం కిలోకు రూ.4ల చొప్పున ప్రభుత్వ మద్దతు ధరగా మొత్తం రూ.260కోట్లను మంజూరు.

అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్‌కు ప్రభుత్వ కంపెని ఏర్పాటు.

ఎపి షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం –1988లోని సెక్షన్ 23కి సవరణ , 73వ సెక్షన్‌కు సవరణను కలిపి ది ఆంధ్రప్రదేశ్ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (అమెండ్ మెంట్) బిల్లు –2025 . ఎపి మోటారు వాహనాల పన్ను చట్టం –1963 ఐదవ షెడ్యూల్‌లోని క్రమసంఖ్య 1,2,3ని సవరిస్తూ ఎపి మోటారు వాహనాల పన్ను (సవరణ) బిల్లు 2025 స్థానం లో ఆర్డినెన్స్. రాజధానిలో రెండో విడత భూ సేకరణ విషయం మంత్రి వర్గ ఉపసంఘం ప్రజల్లో అవగాహన కల్పించిన అనంతరం సిఎం తుది నిర్ణయం.

# మామిడి రైతులను ఆదుకోవడంలో విఫలం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి మండలం నుంచి 15 నుంచి 20 కారుల్లోనూ, ద్విచక్ర వాహనాల్లోనూ భారీగా తరలి వచ్చారు. వారితో కలిసి కొత్తపల్లి నుంచి మార్కెట్ యార్డు వరకూ పెద్ద సంఖ్యలో వాహనాలతో జగన్ రోడ్డు షో నిర్వహించారు. బెంగళూరు నుంచి అరగొండ ఫ్లైఓవర్ వద్దకు 30 మందికే పోలీసులు అనుమతి ఇవ్వగా వందలాది మంది దూసుకొచ్చారు. దీంతో, తోపులాట జరిగింది. అనుమతి ఇచ్చిన సంఖ్య కంటే అదనంగా వచ్చిన వారిని జగన్ రాక ముందే పోలీసులు అడ్డుకొని తిప్పి పంపేశారు. ఎన్ని ఆంక్షలు విధించినా కార్యకర్తలు, అభిమానులు అడ్డదారుల్లో మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. ఒకానొక దశలో మార్కెట్ యార్డులోకి అనుమతి లేదంటూ పోలీసులు నిరాకరించడంతో వందల సంఖ్యలో గేట్లు తోసుకుని రావడంతో ఉద్రిక్తత నెలకొంది. ఆంక్షలు ఉల్లంఘించి కార్యకర్తలు భారీగా తరలి రావడంతో పోలీసులు స్వల్పంగా లాఠీఛార్జీ చేశారు. ఆ క్రమంలో కాన్వారు నుంచి చిత్తూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి జారిపడిపోవడంతో స్వల్పంగా గాయపడ్డారు. మార్కెట్ యార్డులోకి జగన్ చేరుకొనేసరికి పరిసరాలు గందరగోళంగా మారడంతో ఆయన కొద్దిమంది రైతులతో స్వల్పంగా మాట్లాడారు. అనంతరం మార్కెట్ యార్డులో మీడియాతో మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో కిలో మామిడిని రూ.29కు కొన్నామన్నారు. కర్ణాటకలో కిలో రూ.16కు కొనుగోలు చేస్తుంటే, టిడిపి కూటమి ప్రభుత్వం రూ.12కు కూడా కొనడం లేదన్నారు.

చిత్తూరు జిల్లాలో రెండు రూపాయల నుంచి నాలుగు రూపాయలకు మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రైతుల పట్ల కనికరం లేకుండా ప్రభుత్వం మామిడి గుజ్జు పరిశ్రమలకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. రైతులకు పెట్టుబడి సాయం అందలేదని, వారి తరఫున తమ పార్టీ పోరాడుతుందని తెలిపారు. 'అన్నదాతా సుఖీభవ'లోనూ ఎన్నో మెలికలు పెడుతున్నార న్నారు. తాను వస్తున్నానని అభిమానులు వస్తుంటే పోలీసులు ఓవరాక్షన్ చేస్తూ ఆంక్షలు పెట్టడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పర్యటనలో ఆంక్షలు విధించడంపై ఎస్పి మణికంఠతో జగన్ వాగ్వాదానికి దిగారు. కాగా, మామిడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో ఈ సమస్యను జగన్ దృష్టికి తీసుకెళ్లడానికి కొంతమంది రైతులు ఆయన వచ్చే దారిలో రోడ్డుపై మామిడి కాయలు పోసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ వెంట ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నాయకులు ద్వారకనాథరెడ్డి, పూతలపట్టు సమన్వయకర్త సునీల్ కుమార్, జడ్‌పి మాజీ చైర్మన్ కుమార్ రాజా, మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపిపి శిరీష్ రెడ్డి ఉన్నారు

**ఫొటోగ్రాఫర్‌పై దాడి**

బంగారుపాళ్యం మార్కెట్ యార్డులోకి వెళ్లనీయకుండా పోలీసులు ఆంక్షలు విధించడంపై వైసిపి కార్యకర్తలు వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మార్కెట్ యార్డులోని మామిడికాయలను తొక్కి ధ్వంసం చేశారు. ఈ ఘటనను చిత్రీకరిస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివపై కొంతమంది దాడి చేయడంతో మరింత గందరగోళం నెలకొంది. ఫొటోగ్రాఫర్‌పై దాడిని పూతలపట్టు ఎంఎల్ఎ కలికిరి మురళీమోహన్, ఎపిడబ్ల్యు జెఎఫ్ రాష్ట్ర నాయకులు జయరాజ్ ఖండించారు. బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న శివను మురళీమోహన్ పరామర్శించారు.

# మదనపల్లె సబ్ జైల్ తనిఖీ చేసిన జైళ్ల శాఖ రాష్ట్ర డైరెక్టర్ జనరల్



**మదనపల్లె –సూర్య వాస్తవం :** అన్నమయ్య జిల్లా, మదనపల్లె స్పెషల్ సబ్ జైలును రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ అంజనీ కుమార్ తనిఖీ చేశారు. మొదట సబ్ జైల్లో రికార్డులను పరిశీలించిన అంజనీ కుమార్.. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై నేరుగా బేరక్ ల వద్దకు వెళ్లి ఖైదీలను ఆరా తీశారు. శిక్ష అనుభవిస్తున్న వారిలో మార్పు తీసుకొచ్చేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ మెనూ ప్రకారం ఖైదీలకు ఆహారం, ఇతర సౌకర్యాలు ఉండాలని ఆదేశించారు. ఖైదీలు పట్ల జైల్ సూపరింటెంట్, జైలర్లు చిన్న చూపు చూస్తే కఠిన చర్యలు తప్పవని అంజనీ కుమార్ హెచ్చరించారు.


# 'పొలం పిలుస్తోంది'లో అధికారులు



**గుత్తి–సూర్య వాస్తవం, జులై 9:** గుత్తి మండలంలో ఉభిచెర్ల,గ్రా మంలో పొలం పిలుస్తోంది పైన రైతులకు సమావేశం ఏర్పాటు చే యడం జరిగినది.ఈ సమావేశం లో రెడ్డి పల్లి సైంటిస్ట్ కోనేరు లక్ష్మ ణ మాట్లాడుతూ రైతులకు ఖరీఫ్ సీజన్లో వ్యవసాయం పైన తీసుకో వలసిన జాగ్రత్తలు గురించి తెలి యజేయటం జరిగినది.ఖరీఫ్ సీ జన్ లో విత్తనం ప్రతి రైతు విత్తన శుద్ధి చేయాలి అని అలాగే భూసా ర పరీక్ష ప్రకారం ఎరువులు కానీ పురుగుమందులు కానీ వేసు కో వాలి అని తెలియజేయటం జరిగి నది.గుత్తి,ఎడిఎ వెంకటరాముడు మాట్లాడుతూ అలాగే డిపార్టు మెంటు తరుపున ఉన్న స్కీమ్స్ అన్న దాత సుఖీభవ,పీఎంకిసా న్,ట్రాక్టరు పరికరాలు గురించి తె లియజేయటం జరిగినది అన్న దాత సుఖీభవ కోసం నమోదు జులై 15 లోపు క్రాప్ ఇన్సూరెన్స్ చేసుకోండి అన్నారు.ఈ సమావే శంలో,ఎడిఎ వెంకటరాముడు మండల వ్యవసా యాధికారి ము స్తాక్ అహ్మ ద్,విహెచ్ఎ అజయ్ విఎఎ సాగర్,రైతులు పాల్గొన్నా రు.

## సంపాదకీయం

# ప్రాజెక్టు విష్ణుతో ఆర్థిక స్వావలంబన




ఆర్థిక వ్యవస్థలో జర్మనీ దేశాన్ని పక్కన పెట్టాం. మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదిగాం. భవిష్యత్ కాలంలో చైనాను అధిగమించబోతున్నాం. అమెరికాకు దగ్గరగా వెళ్లబోతున్నాం.. ఆర్థికంగా ఎదగడం మాత్రమే కాదు.. రక్షణ పరంగా కూడా అంతే స్థాయిలో వృద్ధిని సాధించబోతున్నాం. ఇదేదో అడ్డగోలుగా చెబుతున్న మాట కాదు. సరదాగా చేస్తున్న వ్యాఖ్య అంతకన్నా కాదు. ఇటీవల పాకిస్తాన్ పై ఆపరేషన్ సిందూర్ తర్వాత మన సైనిక సామర్థ్యం.. మన ఆయుధ సామర్థ్యం.. ప్రపంచానికి తెలిసింది. ముఖ్యంగా యుద్ధ విమానాలను వాడటంలో మనం ఉపయోగిస్తున్న సాంకేతికత ప్రపంచానికి సరికొత్తగా కనిపించింది. అయితే దీనిని ఇక్కడితోనే ఆపివేయాలని భారత ప్రభుత్వం అనుకోవడం లేదు. ఈ సాంకేతికతను మరింత అభివృద్ధి చేసుకోవాలని భావిస్తున్నది. ఈ క్రమంలోనే అత్యంత ఆధునిక రక్షణ వ్యవస్థను భారతదేశం నిర్మించుకుంటున్నది. ఇప్పటికే డిఆర్డిఓ అత్యంత ఆధునికమైన ఆయుధాలను తయారు చేస్తున్నది. వచ్చే ఐదు సంవత్సరాలలో వివిధ రకాల 12 హైపర్ సోనిక్ యుద్ధ క్షిపణులు సిద్ధమవుతున్నాయి. ఇవి దాడి చేయడం మాత్రమే కాదు.. శత్రు దేశాల రక్షణ సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి.

ప్రాజెక్టు విష్ణు లో భాగంగా డిఆర్డిఓ ఈ మిషన్ చేపడుతోంది.. డిఆర్డిఓ చేపడుతున్న మిషన్ లో హైపర్ సోనిక్ గ్లైడ్ వెహికల్, హైపర్ సోనిక్ క్రూజ్ మిస్సైల్స్, హైపర్ సోనిక్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్స్ ఉన్నాయి. దాడిలో అత్యంత వేగవంతమైన సామర్థ్యం.. అత్యంత ఆధునికమైన సాంకేతిక పరిజ్ఞానం వీటిలో ఉపయోగిస్తున్నారు. వీటి ద్వారా శత్రువులను అత్యంత బలంగా ఎదుర్కోవడం.. వెంటనే తుద ముట్టించడం వీటి లక్ష్యమని నిపుణులు చెబుతున్నారు. సరిగ్గా ఏడాది క్రితం డిఆర్డిఓ హైపర్ సోనిక్ మిస్సైల్ పరీక్షను అత్యంత విజయవంతంగా నిర్వహించింది. ఈ ప్రయోగం ద్వారా దేశ స్క్రామ్ జెట్ ఇంజన్ అభివృద్ధిలో ఇది కీలకమైన రాయిగా నిలిచింది.. అంతేకాదు ఈ వ్యవస్థలను అభివృద్ధి చేసి చైనా, రష్యా, అమెరికా స్థాయిలో భారత్ నిలిచింది. లాంగ్ రేంజ్ హైపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ కెపాసిటీ ఉన్న మోస్ట్ పవర్ఫుల్ కంట్రీస్ లో మన దేశం ఒకటిగా నిలిచింది. ధ్వని కంటే ఐదు రెట్ల వేగంతో ప్రయాణించే కెపాసిటీ ఉన్న ఆయుధాలను హైపర్ సోనిక్ అని పిలుస్తుంటారు. ఇలాంటి క్షిపణులను అడ్డుకునే వ్యవస్థ ప్రస్తుతం ప్రపంచంలో ఏ దేశం వద్ద లేదు.


అయితే ఇటువంటి అత్యాధునిక హైపర్ సోనిక్ వెపన్స్ ను డిఆర్డిఓ డెవలప్ చేస్తోంది. వీటిని ఆర్మీ, నేవి, వాయు సేన కోసం డెవలప్ చేస్తోంది. ఇందులో ఫస్ట్ టైం ఎక్స్టెండెడ్ ట్రాజెక్టరీ లాంగ్ రేంజ్ హైపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ ను డిఆర్డిఓ డెవలప్ చేస్తోంది. స్క్రామ్ జెట్ ఇంజన్ తో మాక్-8 స్పీడ్ ను రీచ్ అయ్యే విధంగా దీనిని డెవలప్ చేస్తున్నారు. ఇది 2,500 కిలోమీటర్ల వరకు ఉన్న టార్గెట్ లను చేజ్ చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు 2030 కల్లా వీటిని మన ఆర్మీలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఆయుధాలు మన ఆర్మీకి ఐదు సంవత్సరాల కాలంలో అందుబాటులోకి వస్తాయి. ఇవన్నీ కూడా మన దేశ రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తాయి. అప్పుడు శత్రు దేశాలు మన మీద దాడి చేయాలంటే ఆలోచిస్తాయి. అంతేకాదు బలమైన దేశాల కంటే మనమే ముందు వరుసలో ఉంటాం. అన్నిటికంటే ముఖ్యంగా రక్షణ వ్యవస్థలో అమెరికాతో సమానంగా ఉంటాం. భారత్ ఒకప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా ఉండేది. కానీ, ఇప్పుడు ఎగుమతిచేసే స్థాయికి ఎదిగింది. నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక రక్షణ ఎగుమతులు గణనీయంగా పుంజుకున్నాయి.

గత దశాబ్దంలో దాని రక్షణ ఎగుమతులు 34 రెట్లు పెరిగి, 2024?25 నాటికి రూ.23,622 కోట్లకు చేరాయి. పాకిస్తాన్, చైనా, టర్కీల భౌగోళిక రాజకీయ ఒత్తిడి, అమెరికా ఆయుధ సరఫరా ఖాళీలు, ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనల్లో రక్షణ ఒప్పందాలపై దృష్టి ఈ విజయానికి దోహదపడ్డాయి. భారత రక్షణ ఎగుమతుల విలువ 2013?14 నాటికి రూ.686 కోట్లు ఉండగా, 2024?25 నాటికి రూ.23,622 కోట్లకు చేరాయి, ఇది 34 రెట్ల వృద్ధిని సూచిస్తుంది. 2014 నుంచి అమలులో ఉన్న మేడిన్ ఇండియా కార్యక్రమం దేశీ ఆయుధాలను, డ్రోన్‌లను సమర్థవంతంగా గుర్తించే సామర్థ్యం, ఎలక్ట్రానిక్ జామింగ్ వ్యూహాలను నిరోధించే లక్షణం పెంచింది. ఈ రాడార్‌ను సుఖోయ్?30ఎంకేఐ, రఫేల్, తేజస్ వంటి యుద్ధవిమానాలతో అనుసంధానం చేసే అవకాశం ఉంది. అజర్‌బైజాన్?అర్మేనియా మధ్య నాగోర్నో?కరాబాఖ్ సంఘర్షణలో అజర్‌బైజాన్‌కు టర్కీ, పాకిస్తాన్ మద్దతు ఇవ్వడంతో, భారత్ అర్మేనియాకు ఆకాశ్?1ఎస్, పినాకా రాకెట్ లాంచర్లు, స్వాతి రాడార్లు వంటి ఆయుధాలను సరఫరా చేస్తోంది. ఈ సహకారం అజర్‌బైజాన్ యొక్క సైనిక ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ, టర్కీ, పాకిస్తాన్‌లపై పరోక్షంగా ఒత్తిడి కలిగిస్తోంది. ఇదే సమయంలో 2025లో మోదీ సైప్రస్ సందర్శన, టర్కీ నియంత్రిత ఉత్తర సైప్రస్‌కు వ్యతిరేకంగా బలమైన దౌత్య సందేశాన్ని ఇచ్చింది. సైప్రస్ భారత్ యొక్క భౌగోళిక రాజకీయ వ్యూహంలో మధ్యధరా, యూరోపియన్ మార్కెట్లకు గేట్‌వేగా మారుతోంది.

చైనా?తైవాన్ సంఘర్షణ నేపథ్యంలో, భారత్ తైవాన్‌తో సంబంధాలను బలోపేతం చేస్తోంది. అమెరికా మద్దతుతో, భారత్ తైవాన్‌కు అండగా నిలవడం ద్వారా చైనాకు వ్యూహాత్మక ఒత్తిడి కల్పిస్తోంది, ఇది ఇండో?పసిఫిక్‌లో చైనా ఆధిపత్యాన్ని సవాలు చేస్తుంది. పాకిస్తాన్, చైనా, టర్కీల శత్రుత్వం, అమెరికా ఎగుమతి ఖాళీలు భారత్‌ను స్వదేశీ రక్షణ తయారీ, ఎగుమతులపై దృష్టి పెట్టేలా చేశాయి. మోదీ విదేశీ పర్యటనలు గ్రీస్, అర్మేనియా, సైప్రస్, తైవాన్‌లతో రక్షణ ఒప్పందాల ద్వారా భారత్ యొక్క భౌగోళిక రాజకీయ ప్రభావాన్ని పెంచాయి.

# పవన్ ధీమా వెనుక...

**కాకినాడ - సూర్య వాస్తవం**



చిన్నచిన్న ఇబ్బందులు ఉన్నా.. సర్ధుకోవాలి.. కలిసి పోవాలి..! ఇలా ఒకదాని వెంట మరోటిగా తూటాల్లాంటి మాటలతో సొంత నేతలకు హితబోధ చేశారు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. ఇదే సమయంలో ప్రత్యర్థికి గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఎలా వస్తారో మేమూ చూస్తామంటూ సవాల్ చేశారాయన. ఈ కామెంట్లపైనే ఇప్పుడు ఏపీలో జోరుగా చర్చ సాగుతోంది. పవన్ వ్యాఖ్యల వెనుక మతలబేంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కీలక వ్యాఖ్యలు చేసిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్. నాకు కొంచెం తిక్కుంది.. కానీ దానికో లెక్కుంది. ఇది ఓ పాపులర్ సినిమాలో పవన్ కల్యాణ్ చెప్పిన డైలాగ్. అచ్చం ఇదే మాదిరిగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడే ప్రతి మాటకూ ఓ లెక్క ఉంటుంది. వినే వాళ్లు, చూసే వాళ్లు అది తెలుసుకోవాలి అంతే. లేటెస్ట్‌గా జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్.. మరోసారి అత్యంత కీలకమైన కామెంట్స్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పార్టీలను ఉద్దేశించి ఆయన చేసిన కామెంట్లే ఇప్పుడు పొలిటికల్ సర్కిళ్లలో హాట్ టాపిక్‌గా మారాయి. కూటమి పార్టీల మధ్య విభేదాలు ఉన్నాయంటూ.. ఓవైపు కూటమి పార్టీలకు చెందిన నేతల మధ్య మనస్పర్థలు, అసంతృప్తులు కొనసాగుతున్నాయని విపక్ష వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పైకి కలిసి ఉన్నట్లుగా చెప్పుకుంటున్న కూటమి పార్టీలు.. కొన్నిచోట్ల లోలోన కత్తులు దూసుకుంటున్నాయని సెటైర్లు వేస్తున్నారు. జనసేన, బీజేపీ నేతలకు కూటమిలో పెద్దగా ప్రాధాన్యం లేదని ప్రచారం చేస్తున్నారు వైసీపీ నేతలు. అంతెందుకు ఏపీలో కూటమి పాలన ఏడాది పూర్తి చేసుకున్న వేళ.. గడపగడపకూ టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలు వెళుతున్నారు. ఈ సంవత్సర కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రచారం చేస్తున్నారు. కానీ, జనసేన, బీజేపీ నేతలు మాత్రం ఎక్కడా వీటిల్లో పాల్గొనడం లేదు. దీనిపైనా ప్రత్యర్థి వైసీపీ విమర్శల బాణాలు ఎక్కుపెడుతోంది. సరిగ్గా ఇలాంటి వేళ.. ప్రకాశం జిల్లా పర్యటనలో పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ప్రత్యర్థి పార్టీ నేతల కామెంట్లకు కౌంటర్లు వేశారు. ఇదే సమయంలో కూటమి పార్టీలకు కొన్ని సూచనలు చేశారాయన. ఏపీలో కూటమి పాలన 15 ఏళ్లైనా సాగాలన్న పవన్. ఏపీలో కూటమి పాలన కనీసం 15 ఏళ్లపాటైనా సాగాలని ఆకాంక్షించారు పవన్ కల్యాణ్. అప్పుడే ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు ప్రజలకు సరిగా చేరతాయన్నారు. ఈ క్రమంలోనే కూటమి పార్టీలు కలిసి కట్టుగా సాగడం ఎంతో అవసరం అంటూ హితబోధ చేశారు పవన్. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా మూడు పార్టీలు కలిసి పోటీ చేసినప్పుడు చిన్నచిన్న అసంతృప్తులు సహజమన్నా రాయన. అందుకే ఏ పార్టీనీ తక్కువగా అంచనా వేయొద్దని సూచించారు పవన కల్యాణ్. పిడికిలిలా కూటమి ముందుకు సాగాలన్న పవన్. అన్ని వేళ్లూ ఒకేలా ఉండవన్నారు జనసేన అధినేత. అయినా సరే ఏ వేలి బలం ఆ వేలుకు ఉంటుందన్నారు. అందుకే పిడికిలిలా ముందుకు సాగాలన్నారు. ఇక్కడ కూటమి అంటేనే ఓ పిడికిలి అంటూ మూడు పార్టీల కార్యకర్తలకు హితబోధ చేశారు పవన్. ఎన్ని సమస్యలు, ఇబ్బందులు వచ్చినా రాష్ట్రాభివృద్ధి కోసం కలిసి ముందుకు సాగడం తప్పనిసరి అన్నారు పవన్. ఇదే సమయంలో తనకు పాలనలో ఏ మాత్రం అనుభవం లేదన్నారు. కానీ, గట్టిగా పోరాడే ధైర్యం మాత్రం ఉందన్నారు పవన్. కూటమిలో టీడీపీ అధినేత చంద్రబాబు లేకుండా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఇంత ప్రణాళికా బద్ధంగా నడిపించడం కష్టమంటూ చెప్పుకొచ్చారాయన. కొట్టుకోమని అధికారం ఇవ్వలేదంటూ హితబోధ. కష్టపడమని, సమస్యలు పరిష్కరించమని కూటమి పార్టీలకు ప్రజలు అధికారం ఇచ్చారన్నారు పవన్. అంతేకాని కొట్టుకోమని కాదంటూ సుతిమెత్తగానే ఘాటైన హెచ్చరికలు చేశారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్క కార్యకర్తా, నాయకుడు గుర్తు పెట్టుకోవాలని సూచించారు జనసేన అధినేత. తనకు జనసేన సంక్షేమం, కూటమి సంక్షేమం కంటే ప్రజా సంక్షేమమే ముఖ్యమని తెగేసి చెప్పారు పవన్. తద్వారా పరిస్థితులు ఎలా ఉన్నా.. కూటమి పార్టీలు కలిసి కట్టుగా సాగాల్సిందేనన్న సందేశం ఇచ్చారన్న అభిప్రాయం గట్టిగా విన్పిస్తోంది. 2029లో ఎలా అధికారంలోకి వస్తారో చూస్తామంటూ.. సవాల్. కేవలం కూటమి పార్టీల కార్యకర్తలు, నాయకులకు హితబోధ చేయడమే కాదు.. ప్రత్యర్థి పార్టీకి గట్టి వార్నింగ్ ఇచ్చారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. రౌడీయిజానికి, గూండాయిజానికి భయపడితే రాజకీయం చేస్తామా అంటూ ప్రశ్నించారాయన. మేం అధికారంలోకి వస్తే అంటూ వైసీపీ నేతలు చెబుతున్నారని.. అసలు 2029లో వైసీపీ ఎలా అధికారంలోకి వస్తుందో చూస్తామంటూ సవాల్ విసిరారు పవన్ కల్యాణ్ .మొత్తంగా పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు విశ్లేషిస్తే.. కూటమిగా కలిసి కట్టుగా సాగాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ సాగాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాదు.. ఎన్డీఏ కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న తాను ఆ దిశగా ఎప్పుడూ కృషి చేస్తూ ఉంటానన్న సంకేతాలను మరోసారి బలంగా పంపారన్న కామెంట్లు విన్పిస్తున్నాయి.

# ఆగస్టు 14 నుంచి ఫ్రీ బస్సు

## - కండిషన్స్ అప్లై

**కర్నూలు - సూర్య వాస్తవం**

ఏపీలో మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణానికి సంబంధించి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం కానుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాంణం కల్పిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే గత కొద్ది రోజులుగా అధ్య యనాలు, కసరత్తులు జరిపింది ఏపీ ప్రభుత్వం. ఎట్టకేలకు ప్రారంభించేందుకు సిద్ధపడింది. కానీ రాష్ట్రవ్యాప్తంగా ఉచితం అనేది కాకుండా.. జిల్లాలకు పరిమితం చేయడంతో మహిళలు ఇప్పుడు షాక్‌కు గురవుతున్నారు. స్వయంగా సీఎం చంద్రబాబు ఈ ప్రకటన చేయడంతో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. కర్ణాటక తో పాటు తెలంగాణ మాదిరిగా కాకుండా ఏపీలో కేవలం జిల్లాలకే పరిమితం చేయడం విశేషం. కూటమి అధికారం లోకి వచ్చిన వెంటనే ఉచిత ప్రయాణానికి సంబంధించి.. అధ్యయనానికి క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రులతో కూడిన




బృందం కర్ణాటకలో ఉచిత బస్సు ప్రయాణం పథకానికి సంబంధించి అధ్యయనం చేసింది. ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది.

ఈ ఏడాది నుంచి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో.. ఉచిత ప్రయాణ పథకం పట్టాలు ఎక్కించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. కానీ జిల్లాల వరకే ఈ పథకం పరిమితం చేయడం మాత్రం విమర్శలకు తావిస్తోంది. ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో మహిళలు ఆశగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చని భావిస్తున్నారు. కానీ వారి ఆశలపై నీళ్లు చల్లుతూ చంద్రబాబు జిల్లాలకు ఈ ఉచిత ప్రయాణ పథకం పరిమితం చేయడం విశేషం. దీనిపై విపక్షాలు సైతం అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని వర్తింప చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే, ఈ ఉచిత బస్సు ప్రయాణం జిల్లాలకు మాత్రమే పరిమితమని క్లారిటీగా చెప్పేశారు. జిల్లాలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఆర్టీసీలో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని సీఎం తెలిపారు. ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా ఒకటి. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకం ప్రారంభిస్తారని భావించారు. కానీ, దీని సాధ్యాసాధ్యాలు, లోటుపాట్లపై ప్రభుత్వం అధ్యయనం జరిపి.. పథకాన్ని పక్కగా అమలుచేయడానికి ప్రణాళిక వేసింది. ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణ పథకంపై విదివిధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది.

## అధికార, ప్రతిపక్ష నేతల మధ్య సర్దుబాటు

# అంతు లేకుండా పోతున్న ఇసుక మాఫియా

**విజయవాడ - సూర్య వాస్తవం**

ఏపీలో వ్యవస్థీకృత దోపిడీ జరుగుతోందా? అంతా కలిసి కానిచ్చేస్తున్నారా? బహిరంగంగా విమర్శలు చేసుకొని.. పరోక్షంగా సహకారం అందించుకుంటున్నారా? నీకింత నాకింత అంటూ వాటాలు వేసుకొని దోపిడీకి తెర తీశారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయింది. అన్ని రకాల వ్యవస్థలు, పాలసీలు గాడిలో పడ్డాయి. అదే సమయంలో అధికార, ప్రతిపక్ష నేతల మధ్య సర్దుబాటు కూడా సవ్యంగా సాగిపోతున్నట్లు తెలుస్తోంది. మద్యం, ఇసుక, మట్టి.. ఇలా అన్ని రకాల మాఫియాలు కోరలు చాస్తున్నాయి. కోట్లాది రూపాయలు కొల్లగొడుతు న్నాయి. రోజువారి ఆదాయం, కమిషన్లతో వందల కోట్ల రూపాయలు పక్కదారి పడుతుంది. ఎవరున్నా ఏం గర్వకారణం అంటూ తతంగం సాగుతోందిఏపీలో దోపిడి పార్ట్నర్స్ కొనసాగుతోందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. సాధారణంగా రాజకీయ నేతలకు అనుచరులు, ఆప్తులు, బంధువులు ఉంటారు. వారికి ఆ నేత ప్రాధాన్యం ఇస్తుంటారు. కానీ ఇప్పుడు కొత్త రిలేషన్ పుట్టుకొచ్చింది. అదే ప్రాణం కంటే మించి మారిపోయింది. డబ్బులు ఊరికే రావన్న ఓ ప్రకటన చూసి స్ఫూర్తి పొందారు నేతలు. తెర ముందు కొట్టుకుందాం.. తెర వెనుక పంచుకుందాం అన్న మాదిరిగా చేతులు కలిపారు.




కోట్లు కొల్లగొడుతున్నారు. బయటకు మాత్రం స్ఫూర్తిదాయక మైన మాటలతో గడుపుతున్నారు. నా పేరిట ఒక్క కంపెనీ అయినా ఉందా.. ఒక్క మద్యం దుకాణం అయినా ఉందా అంటూ తేలికపాటి మాటలు చెబుతున్నారు. తెర వెనుక బినామీలను పెట్టి.. మేమున్నాం గో హెడ్ అంటూ ప్రోత్సహిస్తున్నారు. జగన్ హయాంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలు నడిపింది. ప్రభుత్వ పెద్దలే దోపిడీ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ప్రైవేటు వ్యక్తుల చేతికి మద్యం షాపులు వెళ్లాయి. కానీ గతం మాదిరిగా మద్యం వ్యాపారులు మాత్రమే ఈ దుకాణాలు నడపడం లేదు. తెర వెనుక ఎమ్మెల్యేలు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు. పెట్టుబడి పెట్టేందుకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు.. ప్రతిపక్ష నేతలు ఫండింగ్ ఇచ్చారు. ఇది అన్ని చోట్ల బాహటంగానే కనిపిస్తోంది. కానీ మీడియా ముందు.. వివిధ వేదికల వద్ద మాత్రం రాజకీయంగా వారు విభేదిం చుకుంటున్నారు. కానీ వ్యవస్థీకృత దోపిడీ విషయంలో మాత్రం పరస్పరం సహకారం అందించుకుంటున్నారు. తెలుగు నాట ఏ ప్రాంతంలో చూసిన ఇది కనిపిస్తోంది. ముఖ్యంగా ఏపీలో మాత్రం ఈ దోపిడీ రోజురోజుకు విస్తృతం అవుతోంది. ఒక్క మద్యం కాదు.. మట్టి, ఇసుక మాఫియ కు అంతులేకుండా పోతుంది. నదుల్లో ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పేరుకే ఉచితం కానీ.. ఆ ఉచితం మాటున పెద్ద ఎత్తున ఇసుకను తరలించి వందల కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. మట్టి మాఫియా చెలరేగిపోతోంది. అయితే ఇది గ్రామాలకు కూడా విస్తరిస్తోంది. చెరువులతో పాటు కాలువల అభివృద్ధి పేరిట మట్టిని తోడేస్తున్నారు. తోడేళ్లుగా మారుతున్నారు. అయితే నాడు జగన్మోహన్ రెడ్డి అయినా.. నేడు చంద్రబాబు అయినా వీటిని ప్రోత్సహించడం అనేది నేరమే అవుతుంది. అయితే ఏపీలో ఈ వ్యవస్థీకృత దోపిడీ ఎవరు అధికారంలో ఉన్న.. అనధికారికంగా జరుపుతూనే ఉన్నారు.

# సుపరిపాలనకు చిరునామా కాంగ్రెస్

- సుపరిపాలన అంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటే సుపరిపాలన
- వైకాపా,టిడిపి లకు సుపరి పాలన అంటే అర్థం తెలియదు
- సుపరిపాలన పేరుతో ఫోజులు కొడుతున్న వైకాపా,టిడీపీ లు
- మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డా.నర్రెడ్డితులసి రెడ్డి



**రాయ చోటి-సూర్య వాస్తవం, జులై 9:** సుపరి పాలనకు కాంగ్రెస్ చిరునామా అని వైకాపా, టీడీపీ పార్టీలకు సుపరి పాలన అంటే అర్థం కూడా తెలియదని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని మండల కేంద్రం గుర్రంకొండలో కాంగ్రెస్ బుధవారం పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి వెళ్తున్న ఆయన వాహనాన్ని దారి మార్గం బైపాస్ రింగ్ రోడ్డు లో ఆపి స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తులసి రెడ్డికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాయచోటి విలేకరులతో ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలకు పేర్లు మార్చి కొన్నిటినికొనసాగించడం,కొన్నిటిని రద్దు చేయడం తప్ప వైకాపా, టీడీపీ ప్రభుత్వాలు కొత్తగా చేసిందేమీ లేదని తులసి రెడ్డి వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీలకు 15 శాతం,ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 25 శాతం,ముస్లిం మైనారి టీలకు 4 శాతం , మహిళలకు 33 శాతం రిజర్వే షన్లు కల్పించింది.1975 లోనే దారిద్ర్య నిర్మూలన కోసం దివంగత ప్రధాని ఇందిరాగాంధీ 20 సూత్రా ల ఆర్థిక కార్యక్ర మం ప్రారంభిం చింది. వ్యవసా య రంగానికి సంబంధించి పం ట రుణాలు,పంటల బీమా, ఇన్పుట్ సబ్సిడీ,వ్యవసాయ రుణాలమాఫీ,ఉచితవిద్యుత్,పావలా వడ్డీ రుణాలు,సున్నా వడ్డీ రుణాలు,తదితర పథకా లను కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రారంభించి అమలు చేశాయి అన్నారు.శ్రీశైలం ,నాగార్జున సాగర్ ప్రాజెక్టు, ధవళేశ్వరం, ప్రకాశం బ్యారేజీలను కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించి ఆంధ్ర ప్రదేశ్ ను అన్నపూర్ణగా చేశాయి.తెలుగు గంగ, గాలేరు నగరి,హంద్రీనీవా, వెలిగొండ, పులి చింతల,పోలవరం తదితర ప్రాజెక్టులలో సింహ భాగం పనులు కాంగ్రెస్ పాలన లో జరిగాయి.విశాఖ ఉక్కు కర్మాగారం,విశాఖ,కృష్ణ పట్నం తదితర నౌకాశ్రయాలు,శ్రీసిటీ, తదితర పారిశ్రామిక,సాంకేతిక సంస్థలు కాంగ్రెస్ పాలనలో వచ్చాయి.ఫీజు రీయింబర్స్ మెంటు, ఆరోగ్యశ్రీ,108,104, బంగారుతల్లి,అమ్మహస్తం ,మీసేవ తదితర పథకాలన్నీ కాంగ్రెస్ పాలనలోనే ప్రారంభమయ్యాయి.ఉపాధి హామీ పథకం,విద్యా హక్కు చట్టం,సమాచార హక్కు చట్టం,ఆహార భద్రతా చట్టం,గృహ హింస నిరోధక చట్టం తదితర విప్లవాత్మకమైన చట్టాలన్నీ కాంగ్రెస్ పాలనలోనే వచ్చాయని తులసి రెడ్డి ఈ సందర్భంగా మీడియాకు వివరించారు.ఎద్దు ఈడుస్తా ఉంటే పిడుదు వగిరించినట్లు వైకాపా, టీడీపీ పార్టీలు ఫోజులు కొడుతున్నాయని తులసి రెడ్డి ఎద్దేవా చేశారు.కూటమి ఏడాది పాలన లో రాష్ట్రం లో ఒక్క ఇళ్లు కూడా నిర్మించ లేదు.ఒక్క కడప జిల్లా లోనే 49,838 ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉంటుందని ఆయన అన్నారు.మీడియా సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అల్లాబకష్,రఫీ,చెన్న కృష్ణ,బుల్లెట్ భాషా, రమణమ్మ,స్వనజా రెడ్డి,వేణు గోపాల్ రెడ్డి,డాక్టర్ రమణ, చక్రి,రవి శంకర్ రావు, సాంబ శివారెడ్డి ,ఉత్తన్న, వెంకటేశ్, నాగరాజు, బాబా తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అమృతమూర్తికి అభినందనలు

- మదర్స్ మిల్క్ బ్యాంక్ కు మూడు లీటర్ల పాలు ఇచ్చిన ఓ అమ్మ
- అమ్మా మీ రుణం తీర్చలేనిదంటూ కొనియాడిన జీజీహెచ్ ఆర్. ఎం.ఓ డాక్టర్ హేమలత



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జులై 9 :** తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం. అంతటి ప్రాధాన్యం కలిగిన పాలు లేక..ఎందరో తల్లులు తల్లడిల్లుతున్నారు. తమ బిడ్డలకు పాలు ఇవ్వలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇదే సమయంలో ఓ తల్లి తన బిడ్డకు పాలు ఇచ్చాక.. మిగిలిన పాలను మదర్స్ మిల్క్ బ్యాంక్ కు దానంగా ఇవ్వడం అది కూడా ఇప్పటి వరకు మూడు లీటర్ల పాలు ఇవ్వడం ఒక రికార్డుగా చెప్పారు అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జుల హేమలత.

రాయదుర్గం చెందిన మల్లికార్జున భార్య త్రివేణి గడచిన నెల 24న మగ బిడ్డకు జన్మనిచ్చారు. ప్రభుత్వాస్పత్రిలో సాధారణ కాన్పు అయ్యారు. అయితే తొమ్మిది నెలలు నిండకనే అంటే ఏడో నెలలోనే బిడ్డ పుట్టడం, తక్కువ బరువు ఉండడంతో ఇక్కడి ఆస్పత్రిలోని నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో అడ్మిట్ చేశారని ఆర్. ఎం. ఓ తెలిపారు. త్రివేణి తన బిడ్డకు పాలు ఇస్తూనే తన బిడ్డలాగే ప్రతి బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని భావించి అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ కు ఇప్పటి వరకు ఏకంగా మూడు లీటర్ల పాలు దానంగా ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. ఆ తల్లికి తమెంతో రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

అందరు బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలని తపించడం నిజంగా ఒక తల్లికే సాధ్యమని మరోసారి త్రివేణి నిరూపించారని కొనియాడారు. ఈ సందర్భంగా త్రివేణి దాతృత్వానికి మెచ్చి ఆమెను పుట్టింటి సారెతో సన్మానించారు. కార్యక్రమంలో న్యూట్రిషన్ సాయిపల్లవి, కౌన్సెలర్ రాధ, స్టాఫ్ నర్స్ సునీత, ఎస్.ఎన్.సీ. ఈ స్టాఫ్ నర్స్ పర్వీన్, సెక్యూరిటీ గార్డ్ సరోజ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ, గ్రామ సేవకుల సంఘం,
# ఆటో కార్మికుల నిరసన ర్యాలీ



**సిద్దవటం - సూర్యవాస్తవం, జూలై 9:** సిద్దవటం మండలంలో బుధవారం దేశవ్యాప్త సమ్మె భాగముగా అంగన్వాడీ యూనియన్, గ్రామ సేవకుల సంఘం ఆటో కార్మికులు కార్మికులు అందరూ కలిసి దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సిద్దవటం తాహసిల్దార్ కార్యాలయం నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూపాయలు 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా చేయాలన్నారు. అంగన్వాడీ ఆయాలను టీచర్ల గా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. యాప్ లను రద్దు చేయాలని, అన్ని యాప్ లను కలిపి ఒక యాప్ గా చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 1986 సంవత్సరం కాలం నుండి కార్మిక చట్టాలు ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం లేబర్ కోర్టులో పెట్టి 29 సంఘాలను తీసివేయాలని పన్నాగం చేస్తున్నాయన్నారు. లేబర్ కోర్టులు ఏర్పాటు చేస్తే దేశవ్యాప్తంగా వ్యాప్తంగా ఆందోళన కాం ర్యక్రమాన్ని నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వసుంధరా దేవి, అధ్యక్షురాలు అరుణకుమారి, లక్ష్మీదేవి, సుశీలమ్మ, గ్రామ సేవకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి వెంకటపతి, మండల అధ్యక్షుడు దేవదాస్, కొండయ్య దళిత వేదిక సంఘం నాయకులు శివప్రసాద్, మున్సిపల్ వర్కర్ నాయకులు వెంకటసుబ్బయ్య, నరసింహులు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## 80 శాతం సబ్సిడీతో మండలానికి
# ఒకటి చొప్పున కిసాన్ డ్రోన్ పంపిణీ

- జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు బి. చంద్ర



**సిద్దవటం - సూర్యవాస్తవం, జూలై 9 :** 80 శాతం సబ్సిడీతో మండలానికి ఒకటి చొప్పున కిసాన్ డ్రోన్ పంపిణీ చేస్తున్నట్లు జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు బి. చంద్ర నాయక్ తెలిపారు. సిద్దవటం మండలంలోని శాఖరాజు పల్లి గ్రామం లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహి ంచడం జరిగింది.

ఈ కార్యక్రమానికి జిల్లా సంయుక్త వ్యవ సాయ సంచాలకులు బి. చంద్ర నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రయోజనాలు, విధి విధానాలు వివరించ డం జరిగిందన్నారు. కిసాన్ డ్రోన్స్ ప్రాముఖ్యతను వివరించడం జరిగిందన్నారు. 80 శాతం సబ్సిడీపై మండలానికి ఒకటి చొప్పున కిసాన్ డ్రోన్స్ ఇవ్వడం జరుగుతోందని ఆసక్తి కలిగిన రైతు బృందాలు సంబంధింత మండల వ్యవసాయ అధికారిని గాని, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులను గానీ సంప్రదించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం లబ్ది పొందాలంటే ఫార్మర్ ఈకేవైసీ ఫింగర్ ద్వారా చేయించుకోవా లన్నారు. ఖరీఫ్ లో సాగయ్యే ప్రతి పంటను ఈ పంట నమోదు చేయాలని సిబ్బందికి సూచిం చామన్నారు. రైతులు వ్యవసాయ సిబ్బందికి సహకరిం చాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబిం చాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించడం జరిగిందన్నారు. అనంతరం సిద్ధవటం మండల వ్యవసాయ అధికారి కార్యాల యంలో ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డ్స్ పరిశీలించామన్నారు.

తర్వాత అక్కడే ఉన్న వరి సాగు చేస్తున్న రైతులతో ఆయన మాట్లాడి తప్పని సరిగా ఎరువుల యాజమాన్యాన్ని పాటించాలని అదేవిధంగా విచ్చలవిడిగా ఎరువులు వేయరాదని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే. రమేష్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి వై. ప్రభాకర్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు మురళి, శివ కుమార్ మరియు రైతులు పాల్గొన్నారు.

## డీసీసీబీ ఛైర్మన్ అమాస రాజశేఖరరెడ్డిని సన్మానించిన నేతలు



**కుప్పం -సూర్య వాస్తవం, జూలై 9:** చిత్తూరు జిల్లా డీసీసీబీ ఛైర్మన్ గా ఎన్నికైన అమాస రాజశేఖర్ రెడ్డిని కుప్పం మున్సిపల్ కౌన్సిలర్లు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు జాకీర్, జిమ్ దాము, పార్టీ విస్తరణ కమిటీ సభ్యులు మంజునాథ్, మాజీ ఎంపిటిసి ఉమాపతి, మాజి వార్డ్ సభ్యులు నాను లు ఆయనను సన్మానించారు. కుప్పం పట్టణంలోని డీసీసీబీ బ్యాంకుకు విచ్చేసిన ఛైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి డిసిసిబి ఛైర్మన్ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.


## పిఏసిఎస్ అధ్యక్షులు ఏకగ్రీవ ఎన్నిక



**రాప్తాడు-సూర్య వాస్తవం, జూలై 9:** రాప్తాడు మండలంలోని పిఏసిఎస్ బుక్కచెర్ల మరూరు సొసైటీ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.బుక్కచెర్ల పిఏసిఎస్ అధ్యక్షులుగా బ్రహ్మానందరెడ్డి మరూరు పిఏసిఎస్ అధ్యక్షులుగా గోనుగుంట్ల గోపాల్ నాయుడును ఎన్నుకున్నారు.ఈ శుభ సంధర్భంగా అధ్యక్షులు ఇద్దరు మండల కన్వీనర్ పంపు కొండప్ప ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు ఇతర మండల నాయకులు కార్యకర్తలతో కలిసి అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ లను కలిసి పుష్పగుచ్చాలు అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు.స్వీట్లు పంపిణీ చేశారు.రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ రైతాంగ సమస్యలు పరిష్కరిస్తూ ప్రజాసేవ చేయాలని ఎమ్మెల్యే సూచించారు.అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షులకు టిడిపి నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

## క్యాబినెట్ సమావేశంలో
# మంత్రి రాంప్రసాద్ రెడ్డి





**రాయచోటి-సూర్య వాస్తవం, జూలై 9:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి సచివాలయంలో బుధవారం సీఎం నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో సహచర మంత్రులతో కలిసి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారని సమాచారం. ఈ క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళలకుఉచిత బస్సు సౌకర్యం పై కీలక ప్రకటన చేశారని, ఆగస్టు 15వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సుసౌకర్యంకల్పించబోతున్నట్లు మంత్రి క్యాంప్ కార్యాలయ సమాచారం అందింది. అయితే ఫ్రీ బస్సు జిల్లాకే పరిమితం చేయ బోతు న్నట్లు అధికారి కంగా ఆయన వెల్లడించినట్లు తెలుస్తోంది. జిల్లా దాటితే చార్జీలు వసూలు చేయబోతున్నారని సమాచారాన్ని మంత్రి క్యాంప్ కార్యాలయం వారు ప్రకటనలు పేర్కొన్నారు.

## బ్రిడ్జ్ నిర్మాణ పనులు
# నాణ్యతతో చేపట్టాలి

- నారాయణపురంలో నూతన బ్రిడ్జ్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 9:** నారాయణపురంలో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను నాణ్యతతో చేపట్టాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురంలోని నారాయణపురంలో గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నూతన బ్రిడ్జ్ నిర్మాణ పనులను అధికారులు, టిడిపి నాయకులతో కలిసి పరిశీలించారు. మరి కొద్ది రోజుల్లోనే ఈ వంతెన నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అనంతపురం నియోజకవర్గంలో అభివృధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.



# విదేశీ వైద్యవిద్య గ్రాడ్యుయేట్లను ఆదుకోండి

## - హోంగార్డుల జీతాల పెంపునకు చర్యలు తీసుకోండి
## - సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి



**అమరావతి - సూర్య వాస్తవం, జూలై 9:** విదేశీ వైద్య విద్య పట్టభద్రుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన ఆయన విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన పట్ట భద్రులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. వైద్యవిద్యలో విదేశాల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఏపీకి చెందిన విద్యార్థులకు ఏపీ వైద్య మండలి శాశ్వత రిజిస్ట్రేషన్ నిరాకరిస్తోందని, ఈ నిబంధనను సవరించేలా చూడాలని ఆయన ముఖ్యమంత్రికి విన్నవించారు. వైద్య నిపుణుల కొరత ఉన్న ప్రస్తుత తరుణంలో ఏపీఎంసీ నిబంధనల్ని మార్చుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా, యూపీ లాంటి రాష్ట్రాల్లో ఇప్పటికే నిబంధనల్ని సవరించారని తెలిపారు. హోంగార్డుల సమస్యలపైనా రామకృష్ణ వినతిపత్రం అందించారు. వారి జీతాల పెంపుదలతో పాటు పోలీస్ ఎంపికలో కోటా అమలు, ఏపీ, తెలంగాణలో స్థానికత కలిగిన హోంగార్డులను స్వరాష్ట్రాలకు బదిలీ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

# టిడిపి నాయకుడు నాగూర్ వలికి అరుదైన గౌరవం

## - ఏపీపీటిడి మదనపల్లి 1,2టు డిపోల గౌరవాధ్యక్షుడిగా ఎంపిక
## - శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే జహా, నాయకులు



**మదనపల్లె - సూర్య వాస్తవం, జూలై 9:** రాజకీయాల్లో నిస్వార్థమైన సేవలు అందిస్తున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నాగూర్ వలి (షో ఆఫ్ శీనా)కి అరుదైన గౌరవం లభించింది.ఏపీపీటిడి మదనపల్లి - 1,2టు డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడిగా రాష్ట్ర అధినాయకత్వం నియమించింది.ఈ సందర్భంగా బుధవారం నాగూర్ వలి మాట్లాడుతూ ఏపీపీటిడిలో తనకు సముచిత స్థానం కల్పించడం ఆనందంగా ఉందన్నారు.మనం చేసే పనిలో నిజాయితీ, నిబద్ధత ఉన్నప్పుడు పదవులు వాటి అంతట అవే లభిస్తాయన్నారు.ముఖ్యంగా రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి,తన రాజకీయ గురువు ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా ఆశీస్సులతో ఈ బాధ్యతలు స్వీకరించబోతున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అలుపెరుగని కృషి చేస్తానన్నారు.తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి అటు ఆర్టీసీకి,ఇటు తెలుగుదేశం పార్టీకి మంచిపేరు తీసుకొస్తానని స్పష్టం చేశారు.తనను ఏపీపీటిడి మదనపల్లి 1,2టు డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడిగా ఎంపిక చేసిన యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యన్ వి కుమార్ మదనపల్లె 1,2 డిపో నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా నన్నారు.అనంతరం పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఏపీపీటిడి మదనపల్లి 1,2టు డిపోల గౌరవాధ్యక్షుడిగా నాగూర్‌వలి సరైన వ్యక్తి అని కితాబునిచ్చారు.ఆయన సారథ్యంలో యూని యన్ మరింత బలపడుతుందని ధీమా వ్యక్తం చేశారు.ఈనెల 11వ తేదీ అనగా శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ 74 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహి స్తున్నామని, ఆ సమావేశానికి యూనియన్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులతో పాటు గౌరవాధ్యక్షులు నాగూర్ వలి హాజరై బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు.కావున ఏపీపీటీడీ నాయకులు అధిక సంఖ్యలో హాజరై ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# డి.ఎస్.నకార విగ్రహావిష్కరణ



**గుత్తి-సూర్య వాస్తవం,జులై 9:** గుత్తి అనంతపురం జిల్లా కృష్ణ కళా మందిరంలో జరిగిన కీ,శే,డి. ఎస్.నకార విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నాము.గుత్తి శాఖ వారు అన్ని కార్యక్రమాలులో ముందు ఉన్నారని జిల్లా నా యకులు పెద్దన్న గౌడ్ గుత్తి యూ నిట్ తాలుకా పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అబూబాకర్ ను సన్మానించారు.

# డంపింగ్ యార్డ్ తరలించకపోతే ఎన్నికల్లో పోటీ చేయనన్నావు..?

## - మరి సిగ్గులేకుండా ఎలా పోటీ చేశావ్.. మాజీ ఎమ్మెల్యే అనంతకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రశ్న
## - నారాయణపురంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 9:** అనంతపురం నగరంలో ఉన్న డంపింగ్ యార్డ్ ను తరలించకపోతే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పిన అనంత వెంకట్రామిరెడ్డి గత ఎన్నికల్లో ఎందుకు పోటీ చేశారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రశ్నించారు. అర్బన్ నియోజకవర్గంలోని నారాయణపురం పంచాయతీలో ఆయన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రతి ఇంటి వద్ద ఎమ్మెల్యేకు మంచి స్పందన కనిపించింది. ముఖ్యంగా సంక్షేమ పథకాలపై ప్రజల నుంచి హర్షం వ్యక్తమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి ఏడాదిలోనే ఇచ్చిన హామీలను నెరవేర్చామని దగ్గుపాటి అన్నారు. అంతే కాకుండా రాష్ట్రానికి ముఖ్యమైన చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో భారీగా పెట్టుబడులు వస్తున్నాయని ఇప్పటికి 8.50 లక్షలు ఉద్యోగాలు కూడా వచ్చాయన్నారు. గత ఎన్నికల ముందు మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఈసారి డంపింగ్ యార్డ్ తరలించకపోతే ఎన్నికల్లో పోటీ చేయనని సవాల్ చేశారని అయితే సిగ్గు లేకుండా మళ్లీ ఎన్నికల్లో పోటీ చేశారన్నారు. అంత పెద్ద మనిషి మాట ఇచ్చి తప్పారని విమర్శలు చేశారు. అక్టోబర్ 2 నాటికి డంపింగ్ యార్డ్ పూర్తి స్థాయిలో తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు. 750 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, 80 కోట్లతో నడిమి వంక, మరువ వంక ప్రొటెక్షన్ వాల్స్ నిర్మిస్తామన్నారు. నారాయణపురం పంచాయతీలోని ఈ ఏడాదిలోని అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. 6 కోట్లతో ఇప్పటికే సిసి రోడ్లు వేశామని, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో మరో రెండు కోట్ల రూపాయల పనులు చేపట్టినట్లు వివరించారు. నారాయణపురం పంచాయతీలో తాగునీటి సమస్యను తీర్చేందుకు పీఏబీఆర్ నుంచి ప్రత్యేకంగా పైప్ లైన్ వేసినట్లు చెప్పారు. అది కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఏడాది కాలంలోనే ఇంత అభివృద్ధి చేసామని.. కచ్చితంగా నాలుగేళ్లలో మరింత అభివృద్ధి చేస్తారన్నారు. పదేళ్ల పాటు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంటుందని.. ఏపీ నెంబర్ వన్ గా మార్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని అది చేసి చూపిస్తారని దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు పరమేశ్వర్, కడియాల కొండన్న, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, టిడిపి నాయకులు అడపాల రఘు, బాలా, ఈశ్వరయ్య, వడ్డే హరి, వెంకట లక్ష్మీ, వరాలమ్మ, హాజీ, నెట్టెం బాలకృష్ణ, ఈడిగ నాగభూషణం, జయరాం నాయక్, పంచాయతీ సెక్రటరీ ప్రవీణ్ టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# రైతులు పంటల బీమాను చెల్లించండి

## - ఏవో కృష్ణ చైతన్య



**రాప్తాడు-సూర్య వాస్తవం, జూలై 9:** అతివృష్టి అనావృష్టి ఇతర కారణాల వలన పంట నష్టం వాటిల్లితే రైతుకు పంట నష్టపరిహారం అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టినందువలన రైతులు పంటల బీమాను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణ చైతన్య తెలియజేశారు.రాప్తాడు రైతు సేవ కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సంధర్భంగా ఏవో కృష్ణ చైతన్య మాట్లాడుతూ 2025 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి పంటల బీమా కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలి అని తెలిపారు. రైతులు బ్యాంకులలో రుణం రెన్యూవల్ చేసుకోవడం లేదా కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా లేదా రైతులు స్వయంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పోర్టల్ నందు పంటల బీమా ను నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ప్రీమియం చెల్లించేందుకు వెళ్లేటప్పుడు 1బీ ఆధార్ కార్డు బ్యాంక్ ఖాతా జిరాక్స్ మొబైల్ నెంబర్ తీసుకువెళ్లాలి.కౌలు రైతు అయితే సిసిఆర్ సి కార్డు మరియు పంట ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకెళ్లాలి. వాతావరణ ఆధారిత భీమా పంటల వారీగా పత్తి రూ.1140 వేరుశనగ రూ.640 దానిమ్మ రూ. 3750 చీనీ రూ.2750 టమాటో రూ. 1600 అరటి రూ.3000 చెల్లించాలి. అలాగే దిగుబడి ఆధారిత బీమా కంది రూ.80 వరి రూ.164జొన్న రూ.84 మొక్కజొన్న రూ.132 ఆముదం రూ.80 ఎర్ర మిరప రూ.576 చెల్లించాలి అని అన్నారు. రైతులకు అవసరమైన సూచనలు సలహాలు ఇచ్చారు.అన్నదాత సుఖీభవ సంబంధించి అర్హత ఉన్న ఆన్ లైన్ లో అనర్హులుగా కనిపించిన రైతులు తిరిగి రైతు సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ అర్జీలు పెట్టుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత ఉందా లేదా అనే విషయం తెలుసుకోవడానికి రైతులు రైతు సేవ కేంద్రంలో లేదా మీసేవ ద్వారా తెలుసుకోవచ్చు.

అర్హత ఉన్నటువంటి రైతుల జాబితాని రైతు సేవ కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి దివ్య ఎఈఓ రంజితరాణి విహెచ్ఎ సోనియా వి ఏ ఏ శ్రీనివాసులు ఎంపీఈఓ పద్మ రైతులు పాల్గొన్నారు.

# గ్రంథాలయంలో బుక్ రీడర్స్ క్లబ్ ప్రారంభం

## - గ్రంథాలయాధికారిణి వసంతకుమారి

**మదనపల్లి - సూర్య వాస్తవం, జూలై 9:** మదనపల్లె శాఖ గ్రంథాలయ భవనంలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బుక్ రీడర్స్ క్లబ్ ను ప్రారంభించడం జరిగిందని మదనపల్లె శాఖ గ్రంథాలయం గ్రంథాలయ అధికారిణి వసంతకుమారి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, యువకులలో పఠణాశక్తిని పెంపొందించడం, సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, గ్రంథావిష్కరణలు, గ్రంథ సమీక్షలు గావించడం బుక్ రీడర్స్ క్లబ్ యొక్క ముఖ్య ఉద్దేశమని తెలియ జేశారు. అనంతరం హైదరాబాద్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డును అందుకున్న ప్రజా చైతన్య స్రవంతి, మదనపల్లె టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు ను అభినందిస్తూ వారికి సన్మానం చేశారు. అదే క్రమంలో 76వ సంవత్సరం లోకి అడుగు పెట్టిన ప్రముఖ కథ నవలా రచయిత, విమర్శకులు టీఎస్ఏ కృష్ణమూర్తిని స్థానిక రచయితలు, విశ్రాంత ఉద్యోగులు, పాఠకులతో కలసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత మున్సిపల్ కమిషనర్ సహదేవరావు, విశ్రాంత బ్యాంకు మేనేజర్ గొల్లపూడి తిరుపతిరావు, విశ్రాంత గ్రంథాలయ అధికారి జనార్ధన రెడ్డి, బీటీ కళాశాల పూర్వ కరస్పాండెంట్ వై.ఎస్. మునిరత్నం, విశ్రాంత లెక్చరర్ రెడ్డప్ప గ్రంథ కర్తలు రామిగాని ఉమాదేవి, మోహన వల్లి, వి.ఎం. నాగరాజ, లింగాల యుగంధరాచారి, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.



# లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలి: సిఐటియు




**రాప్తాడు-సూర్య వాస్తవం, జూలై 9:** రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కార్మికులకు కనీస వేతనం నెలకి రూ.26,000 ఇవ్వాలని కాంట్రాక్ట్ కార్మికులను స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి రామాంజనేయులు పేర్కొన్నారు.సిఐటియు ఆధ్వర్యంలో రాప్తాడు మండల కేంద్రం లోని బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలుపుతూ దేశవ్యాప్త సమ్మె చేపట్టారు. జిల్లా ఉపాధ్యక్షులు టి రామాంజనేయులు మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక పోవడంతో నాణ్యమైన బలమైన పంటలు పండించే శక్తిసామర్థ్యాలు ఉన్న వ్యవసాయం చేయలేక కుటుంబాలను పోషించుకోలేక కొట్టుమిట్టాడుతున్నారు. పండించిన పంటలకు ధరలు లేకపోవడంతో రోడ్డు మీద పోస్తున్నారు.దేశంలో ఆహార ఉత్పత్తి తగ్గిపోతోంది అనేది వాస్తవం కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ విషయాన్ని దాచిపెట్టి గొప్పలు చెప్పుకుంటున్నాయి. ఆశ అంగన్వాడీ పంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేయాలి.పాత కార్మిక చట్టాలను అమలు చేయాలి అని తెలియజేశారు కేంద్రం ప్రభుత్వం 4 లేబర్ కోడ్స్ లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తోందన్నారు. లేని పక్షంలో ఈ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు అరుణ రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి పోతలయ్య సిఐటియు నియోజకవర్గ నాయకులు పుష్పరాజు ఓబులయ్య అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు అరుణ సూర్య కళా శ్రీదేవి ఓబులమ్మ ఎల్లమ్మ లక్ష్మీదేవి సావిత్రి, భారతివిజయలక్ష్మి లక్ష్మీదేవి మల్లేశ్వరమ్మ ఆశ వర్కర్ నాయకురాలు గాయత్రీ విజయలక్ష్మి నాగేంద్రమ్మ రామేంద్రమ్మ అనిత చంద్రకళ హమాలీలు గోపాల్ ఆదినారాయణ పంచాయతీ కార్మికులు రాజప్ప కృష్ణయ్య ఓబులపతి ఓబన్న లక్ష్మీదేవి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# హామీని నిలబెట్టుకోవడం చంద్రబాబుకే సాధ్యం

- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్
- రాళ్ళబూదుగురు రోడ్డుకు మహర్దశ
- 4.5 కోట్ల నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- రహదారి పనులకు పూజ చేసి ప్రారంభించిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, తెదేపా శ్రేణులు





**శాంతిపురం– సూర్య వాస్తవం, జూలై 9 :** రాష్ట్ర అభివృద్ధి ప్రదాత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో కుప్పం నియోజకవర్గంలోని ప్రధాన రహదారులకు మోక్షం కలుగుతోందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. బుధవారం ఆయన పలమనేరు జాతీయ రహదారి నుంచి రాళ్ళ బుదుగూరు గ్రామం మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు 9.5 కిలోమీటర్లను , రూ. 4.5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న తారు రోడ్డుకు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రధాన రహదారులన్నీ నాణ్యమైన రహదారులుగా నిర్మించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా బుధవారం రాళ్ళబుదుగురు రహదారికి పూజా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గత ఐదేళ్ల జగన్మోహన్ రెడ్డి పాలనలో కుప్పం నియోజకవర్గంలోని ప్రతి రహదారి గుంతల మయమై ప్రజలను ఇబ్బందికి గురిచేసిన విషయం ప్రజలకు తెలుసన్నారు. అనంతరం ఆయన తెలుగుదేశం పార్టీ నేతలతో కలిసి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ తో పాటు డిసిసిబి చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, నేతలు డాక్టర్ సురేష్ బాబు, శాంతి పురం మండల టిడిపి అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ నాయుడు, ప్రధాన కార్యదర్శి పివి నాగరాజు, ఎంపీటీసీ నామలప్ప, రాళ్ళబూదుగూరు నేతలు ఆర్ ఎస్ మణి, బసవరాజు,బిఎం కుమార్, కలీముల్లా,వాజిద్, జయరాజ్, ఆర్ అండ్ బి అధికారులు, గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# హోం శాఖ మంత్రికి పఠాన్ ఖాదర్‌ఖాన్ వినతి

## - నల్లపు రెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**మదనపల్లి – సూర్య వాస్తవం, జూలై 9:**కొవ్వూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి పై అసభ్య పదజాలంతో దూషించిన మాజీ ఎమ్మెల్యే నల్లపు రెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని ఎపి హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత కు రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు పఠాన్ ఖాదర్ ఖాన్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల నెల్లూరు జిల్లా కొవ్వూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి పై, ఆమె సోదరుడు మరియు మాజీ శాసనసభ్యుడు నల్లపు రెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన అసభ్యకర మైన, మహిళను అవమానించే వ్యాఖ్యలను ఖండించారు. ప్రజాప్రతినిధి అని కూడ గౌరవించకుండా, మహిళ అనే విషయాన్ని పరిగణ లోకి తీసుకోకుండా చేసిన ఆ వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉన్నాయిన్నారు. ఈ చర్యల వల్ల రాష్ట్రం లోని మహిళలంతా కలవరపడుతున్న పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.గతంలో ఇదే పోలీసు యంత్రాంగం, చిన్నచిన్న విషయాలపై తెలుగుదేశం పార్టీ నాయకులపై దూకుడుగా స్పందించేది. ఇప్పుడు మాత్రం అన్ని ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నా కూడా చర్యలు లేకపోవడం పట్ల తీవ్ర ఆవేదన చెందు తున్నామన్నారు.కావున హెూం శాఖ మంత్రిగా చర్యలు తక్షణమే తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నల్లపు రెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి పై చట్టపరమైన చర్యలు తక్షణం తీసుకోవాలని, ఆయన చేసిన వ్యాఖ్యలకు మహిళా సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, భవిష్యత్తులో ఇటువంటి వ్యాఖ్యలు ఎవరి నుండైనా పునరావృతం కాకుండా, కఠినమైన మార్గదర్శకాల ను అమలు చేయాలని కోరారు. పోలీసు వ్యవస్థ రాజకీయ పక్షపాతంతో కాకుండా న్యాయంగా, సమానంగా వ్యవహ రించేలా చర్యలు తీసుకోవాలని అప్పుడే మహిళల గౌరవం కాపాడ బడుతుందనిపేర్కొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెకు కదం తొక్కిన కార్మికులు






**నాయుడుపేట– సూర్య వాస్తవం , జూలై 09:** దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం నాయుడుపేట పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల కథం తొక్కారు.నాయుడుపేట సిఐటియు కార్యాలయం నుండి బయలుదేరిన ర్యాలీ బజారు వీధుల మీదగా అంబేద్కర్ బొమ్మ వద్దకు వెళ్లి మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు లక్ష్మీ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారానికి వచ్చి పెట్టుబడిదారులకు లాభాలు చేకూరుస్తూ, కార్మికులపై ఉక్కు పాదం మోపుతుంటే ప్రశ్నించాల్సిన రాష్ట్ర పార్టీలు టిడిపి,జనసేన బిజెపితో కూటమిగా చేరి కార్మికులకు నష్టం చేకూర్చే చట్టాలను బలపరుస్తున్నారని విమర్శించారు.కూటమి ప్రభుత్వ విధానాలు కార్మికులు ప్రజలు గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో వారికి గట్టిగా బుద్ధి చెప్తారని అన్నారు.సిఐటియు మండల నాయకులు శివకవి ముకుందా,ఎస్ మహేష్ బాబు మాట్లాడుతూ కార్మికులకు నష్టాలు కలిగించే చట్టాలు ప్రజలు కార్మికులు కరోనాతో బాధపడుతున్న తరుణంలో చట్టాలను తెచ్చారన్నారు.కార్మికులకు పాత చట్టాలలో సుప్రీంకోర్టు కనీస వేతన చట్టం అమలు చేయాలని సూచించినట్లు గుర్తు చేశారు. కాగా లేబర్ అధికారులు ఈ చట్టం కార్మికులకు అమలు చేస్తున్నారా లేదా అని పట్టించుకోలేదన్నారు. పిఎఫ్,ఈఎస్ఐ, బోనస్ కాస్త కో స్తా పోరాడి సాధించుకుంటున్నారనితెలిపారు. ప్రస్తుతం కొత్త కార్మిక చట్టాలు 42 చట్టాలను నాలుగు కోడలుగా మార్చి పోరాడే హక్కు లేకుండా ఈ చట్టంలో కనపరిచారని అన్నారు.ఈ కొత్త చట్టాలను రద్దు చేయాలని ఈరోజు కార్మికులు పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమయ్యారని అన్నారు.రాబోయే రోజుల్లో ఈ చట్టాలను రద్దు చేయకుంటే పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో క్యారడార్ కమిటీ సభ్యులు అబ్దుల్లా, అంగనవాడి ప్రాజెక్టు ఎన్ శ్యామలమ్మ,ఆశా వర్కర్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు సుజాత,పెళ్లకూరు మండల నాయకులు మణమ్మ, మధ్యాహ్నం భోజనం జిల్లా కార్యదర్శి కే విజయమ్మ,మండల నాయకులు వనమ్మ,ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు రమణయ్య, వ్యాన్ డ్రైవర్ల యూనియన్ నాయకులు మస్తాన్ రెడ్డి,గిరిజన సంఘం నాయకులు మణెమ్మ,ఆవాజ్ కమిటీ సభ్యులు షేక్ కాలేషా తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నం



**మదనపల్లె –సూర్య వాస్తవం, జూలై 9 :** కుటుంబ సమస్యలతో విషం తాగి వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన కర్ణాటక రాష్ట్రం చేలురులో జరిగింది. బుధవారం ఉదయం వెలుగు చూసిన ఘటనపై మదనపల్లి జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు బాధితురాలు కుటుంబీకుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మధు భార్య మానస (23) కుటుంబ సమస్యల కారణంగా పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించడంతో గమనించిన కుటుంబీకులు ఆమెను వెంటనే మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి, మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలు కుంటు ఉంది.

# మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి : చాపల వెంకటేశ్వర్లు




**నాయుడుపేట– సూర్య వాస్తవం , జూలై 09:** కేంద్రకార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మెపిలుపుమేరకు తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపాలిటీ కార్యక్రమాలు కార్మికులు నిరసన ర్యాలీ చేపట్టారు.మున్సిపల్ కార్యాలయం నుండి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం గాంధీ మహాత్మునికి విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గాన్ని దగా చేస్తూ అనేక నిర్ణయాలు తీసుకోవడం విడ్డూరం ఉందని తెలిపారు.29 కార్మిక చట్టాల్ని నాలుగు లేబర్ కోడ్ లు గా మారుస్తూ కార్మికులకి రక్షణ లేకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఎనిమిది గంటల పని విధానంలో 12 గంటలు పని విధానం తీసుకొచ్చే ప్రయత్నం దుర్మార్గమైందని తెలిపారు. గతంలో సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయడంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తుందని మండిపడ్డారు.తక్షణం నాయుడుపేట మున్సిపాలిటీ కార్మికుల్ని ఆప్కాస్‌లో నమోదు చేయాలని,ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారం పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నెలవల హరికృష్ణ,మధు,మైలారి శ్రీనివాసుల ,రమణమ్మ,ఆరావళి తదితరులు పాల్గొన్నారు.

# రేపే మెగా పీటీఎం 2.0: ఎంఈఓ



**పెళ్ళకూరు– సూర్యా వాస్తవం, జూలై_09:** రాష్ట్రవ్యాప్తంగా, జరుగుతున్న మెగా పేటీఎం 2.0 (తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం) పెళ్లకూరు మండలం లో కూడా 10-7-2025 న జరగనుంది, ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమం జరుగును దేనికి సంబంధించి ఇప్పటికే విద్యాశాఖ అందించిన మార్గదర్శన కార్యక్రమాలను సవ్యంగా జరుగుటకు ముందుగా సమావేశాలను ప్రధానోపాధ్యాయులతో చర్చించి తగని ప్రణాళికను తయారు చేసుకున్నారని ఎంఈఓ మించల శంకరయ్య తెలియజేశారు . ఫోటో బూత్, క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యా సంబంధమైన ప్రగతి నివేదికలు మొక్కలు పెంపకం తదితర వినూత్నమైన కార్యక్రమాలతో మండలంలోని ఉన్నత , ఆదర్శ , మరియు బిపిఎస్ పాఠశాలలో( 28 పాఠశాలలలో) ఈ కార్యక్రమం ఒక పండుగ వాతావరణం లో జరుగుతుందని , దీనివల్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్ఎంసి లు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల మధ్య ఒక ఆత్మీయ సంబరం జరుగుతుందని ఎంఈఓ తెలియజేశారు, ఈ కార్యక్రమానికి పై తెలిపిన 28 పాఠశాల సంబంధిత ఎస్ఎంసి, విద్యార్థుల తల్లి/దండ్రులు, పాఠశాల కోసం అభిమానం ఉన్న ప్రజా ప్రతినిధులు, దాతలు (రాజకీయాలకు కతీతంగా), అధికారులు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవచ్చునని తెలియ జేశారు.

# హత్య కేసులో ముద్దాయికి బెయిల్ మంజూరు



**నాయుడుపేట – సూర్య వాస్తవం, జూలై 09:** తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి రూరల్ పరిదిలో ఇటీవల రిజిష్టర్ కాబడిన క్రైం నెం. 64/2024 నకు సంబందింపబడిన ఒక మర్డర్ కేసులో, అరెస్ట్ కాబడి ప్రస్తుతం జూడిషియల్ రిమాండ్‌లో వున్న ముద్దాయి తరపున, శ్రీకాళహస్తి పట్టణంనకు చెందిన ప్రముఖ క్రిమినల్ డిఫెన్సు లాయర్ విప్పరపల్లి సాయిరాం హాజరై తన వాదనలు వినిపించగా కోర్టు వారు సదరు డిఫెన్సు లాయర్ సాయిరాం వాదనలు తో ఏకీభ విస్తూ, సదరు కేసులోని ముద్దాయి ఏ. నరేష్‌కు బెయిల్ మంజూరు చెస్తూ ఆదేశాలు జారీచెయడమైనది. ఈ సందర్భంగా నరేష్ కుటుంబ సభ్యులు బంధుమిత్రులు జడ్జి కి , ప్రముఖ క్రిమినల్ డిఫెన్స్ లాయర్ విప్పరపల్లి సాయిరాంకి ధన్యవాదాలు తెలుపుకున్నారు.

# కిమ్స్ సవీరా ఆస్పత్రిలో నర్సు అనుమానాస్పద మృతి..?

**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూలై 9:** అనంతపురం శివార్లలోని కిమ్స్ సవీరా కార్పొరేట్ ఆస్పత్రిలో పని చేసే స్టాఫ్ నర్స్ వద్దే దివ్య(22) అనుమానాస్పదస్థితిలో మరణించింది. అందిన సమాచారం మేరకు.. కార్పొరేట్ ఆస్పత్రిలో పని చేస్తూ అక్కడి హాస్టల్ లోనే ఉంటుందని తెలిసింది. అయితే ఏం జరిగిందో ఏమో గానీ హాస్టల్ గదిలో నిద్రపోతున్న దివ్య.. మధ్యాహ్నం అయినా లేవకపోవడంతో షిఫ్ట్ నర్సులు వచ్చి లేపడానికి ప్రయత్నించగా ఆమెలో ఎటువంటి కదలిక లేకపోవడంతో ఆమె మరణించినట్లు గుర్తించారు. అయితే ఈ ఘటనపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేసి నిజానిజాలు నిగ్గుతెల్చాల్సిన అవసరం ఉంది.






# పేషంట్ పై దురుసుగా ప్రవర్తించిన శానిటేషన్ వర్కర్..




**మదనపల్లె –సూర్య వాస్తవం, జూలై 9 :**మదనపల్లి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు బుధవారం వచ్చిన రమణమ్మ అనే మహిళ కు డాక్టర్లు పరీక్షించి... బయాప్సీ చేయాల్సి ఉందని తెలపడంతో గురువారం ఉదయం వరకు రమణమ్మ అనే మహిళను అబ్జర్వేషన్ లో పెట్టుకోవాలని తెలిపారు. ఇదే తరుణంలో రోగి అయిన రమణమ్మ కు మేటి వార్డు నందు ఒక బెడ్ ను ఇవ్వడం జరిగింది. మధ్యాహ్నం సమయంలో హౌస్ కీపింగ్ హెల్పర్ గా విధులు నిర్వహించేందుకు వచ్చిన ఏ అలివేలు అనే మహిళ రోగి రమణమ్మ ఆరోగ్య స్థితి గమనించకుండా... “బెడ్డు పైన పడుకొని ఉండవు రేపు ఆపరేషన్ అయితే ఈరోజు హాస్పటల్లో మీకు ఏం పని ఫస్ట్ బయటికి పో... ఆస్పత్రిలో తేరగా కాళ్లు చాపుకొని పడుకోవడానికి మీ అత్తగారిల్ల” అని రోగితో దురుసుగా ప్రవర్తించింది. నిస్సహాయ స్థితిలో ఉన్న రోగి రమణమ్మ ఏం చేయాలో పాలు పోక పలువురుతో విషయం చెప్పుకొచ్చింది. ఇటువంటి హౌసింగ్ హెల్పర్స్ ఉండడం వల్ల.. చైతన్య జ్యోతి ఏజెన్సీకి ఉన్నటువంటి పరువు కాస్త దిగజారి పోతుందని హాస్పటల్లోని విశ్వసనీయ సమాచారం. ఇప్పటికైనా సదరు విషయం తెలుసుకొని ఉన్నతాధికారులు స్పందించి దురుసుగా ప్రవర్తించే ఏ అలివేలు ఆటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు చెప్పుకొస్తున్నారు.

# నివాళులు అర్పించిన సుగవాసి ప్రసాద్ బాబు

**రాయచోటి–సూర్య వాస్తవం, జులై 9:**అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని మాసాపేట శివాలయం వీధికి చెందిన ప్రముఖ వేంపల్లి మహమ్మద్ రఫీ, అమీర్ తల్లి మరణించిన విషయం తెలిసి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు వెళ్లి భౌతికకాయానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రసాద్ బాబు తో పాటు పలువురు పట్టణ ప్రముఖులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.



# హార్సిలీహిల్స్‌ను ప్రయివేట్ సంస్థలకు ఇవ్వరాదు

- ప్రకృతి అందాలను ప్రజలకు దూరం చేయద్దు
- రాందేవ్ బాబాకు హార్స్ లీ హిల్స్ ఇవ్వద్దు
- హార్సీహిల్స్‌ను కాపాడడానికి పోరాటాలు ఉదృతం చేస్తాం
- హార్సీ హిల్స్ ను సందర్శించిన సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ





**మదనపల్లి – సూర్య వాస్తవం, జూలై 9:** ఆహ్లాదకర మైన హార్సీ హిల్స్ ను కార్పొరేట్ సంస్థ కు అప్పగించి ప్రకృతి అందాలను ప్రజలకు దూరం చేయద్దని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. హార్సిలీ హిల్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఆంధ్ర ఊటీగా పేరు గడించిన అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గంలోని హార్సీ హిల్స్ ను నకిలీ మందులు అమ్ముకునే రాందేవ్ బాబాకు అప్పగించాలను కోవడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. 165 సంవత్సరాల క్రితం హార్సి హిల్స్ అనేది ఉమ్మడి కడప జిల్లా కలెక్టర్గా ఉన్న హార్శిలీ కనుగొన్నారని ఈ హార్శీ హిల్స్ తిరుమల కొండ కంటే చాలా ఎత్తైన సౌందర్యమైన ప్రదేశమని గుర్తు చేశారు. హార్స్ లీ హిల్స్ ను అభివృద్ధి చేస్తే ఊటి కంటే బాగుంటుందని ఎండా కాలంలో కూడా చలిగా ఉన్న ప్రదేశం అన్నారు.

అందమైన ప్రదేశాన్ని టూరిజంగా అభివృద్ధి చేస్తే చాలా బాగుంటుందని, కమ్యూనిజం లేదు సోషలిజం లేదు టూరిజం ఒకటే అన్న ముఖ్యమంత్రి చంద్రబాబు కు టూరిజం పైన కూడా నమ్మకం సడలిందా హార్స్ లీ హిల్స్ ను ఎందుకు అభివృద్ధి చేయడం లేదని ప్రశ్నించారు. రాందేవ్ బాబా కార్పొరేట్ వ్యాపారవేత్తని, అలాంటి వ్యక్తికి ప్రకృతి అందాలను అప్పజెప్పడం అంటే వినాశనం కు నాంది పలకడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. హార్సీ హిల్స్ ను రాందేవ్ బాబా కు ఇస్తే సామాన్య ప్రజలకు స్థానం ఉండదని హార్సీ హిల్స్, కాస్టీ హిల్స్‌గా మారు తుందని ప్రశ్నించారు. రాందేవ్ బాబాకు ఇవ్వాల నుకుంటే ఉద్యమాలు మరింతగా ఉదృతం చేస్తామని హెచ్చరి ంచారు. ఈ కార్యక్ర మంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు, శివారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు సహాయ కార్యదర్శి పి మహేష్ కార్యవర్గ సభ్యులు తోపు క్రిష్టప్ప, సాంబ, మురళి, మనోహర్ రెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు బషీర్ ఖాన్, సిపిఐ ములకలచెరువు మండల కార్యదర్శి అంజనప్ప, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్ సహాయ కార్యదర్శి వినయ్ నాయకులు సాయి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు రెడ్డి సాహెబ్, బహుజన్ సేన నాయకులు శ్రీ చందు మహేష్ మనోహర్‌లు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్ భాష నివాసంలో సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ మర్యాద పూర్వకంగా కలుసు కున్నారు. హార్సిలీ హిల్స్ భూములను బాబా రాందేవ్ కు కట్ట బెట్టడం మంచిది కాదని సూచించారు. ఇదే విషయమే ఎమ్మెల్యే తో చర్చించారు.

# 'పొలం పిలుస్తుంది'లో ఏడిఓ నాగార్జున సాగర్

- పెళ్లకూరు మండలం దిగువ చావలి, శిరసనంబేడు గ్రామాలలో రైతులతో సమీక్ష
- ఆధార్ సీడింగ్, ఈ-పంట నమోదు, పంట భీమా వంటి అంశాలపై అవగాహన
- వ్యవసాయ అధికారులతో రైతులు ముచ్చట
- తమ సమస్యలు వినిపించిన రైతులు



**పెళ్లకూరు సూర్య వాస్తవం, జులై 9:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలోని దిగువ చావలి, శిరసనంబేడు గ్రామాలలో పొలం పిలుస్తుంది అనే కార్యక్రమంలో లో ఏ డి నాగార్జున సాగర్ , ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు పలు సూచనలు అడిం చడం జరిగింది. బుధవారం మండలంలోని దిగువ చావాలి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఏ డి నాగార్జున సాగర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు ప్రభుత్వం అందించే రాయితీ పథకాలు పథకాలు అందుకోవాలని అంటే ప్రతి ఒక్క రైతు ఆధార్ సీడింగ్ చేసుకోవాలని రైతులకు చూచించారు. ఈ- పంటలో నమోద తప్పనిసరి అని తెలియజేశారు. ఇప్పటి వరకు ఎవరైతే చేసుకోలేదో వారు త్వరగా ఆధార్ అనుసంధానం చేసుకొని గ్రీవెన్స్ మాడ్యూల్ లో అప్డేట్ చేసుకోవాలని సూచించారు. తద్వారా ప్రతి ఒక్క రైతుకి అన్నదాత సుఖీభవ లభిస్తుందని చెప్పారు. ఇప్పటికే చాలామంది రైతుల యొక్క పేర్లు నమోదు అర్హత పొంది ఉన్నారు వారికి అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వ రాయితీ వారికి లభిస్తుంది వారి యొక్క జాబితా వివరాలు వ్యవసాయ సేవ కేంద్రాలలోలో ఉంచబడియున్నవి. వ్యవసాయ అసిస్టెంట్లకు ద్వారా అర్హతలు కలిగిన పేర్లు తెలుసుకోగలరు. అర్హత లేని లేని రైతులు వారి పేర్లను ఈనెల 13వ తారీకు లోగా నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు. నమోదు చేసుకునే విషయంలో మీకు ఎటువంటి సలహాలు సూచనలు కావలసి వస్తే రైతు సేవా కేంద్రంలో మా యొక్క సిబ్బంది మీ కొరకు అందుబాటులో ఉంటారని తెలిపారు ఈ యొక్క సదవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోండి అని రైతులకి సూచించారు.రైతులకు ప్రభుత్వం అందించే ఏ రాయితీ పథకమైన చేకూరాలంటే తప్పనిసరిగా ఈ- పంట లో నమోదు చేసుకోవాలని తెలియపరిచారు. ప్రధానంగా పంటల భీమా గురించి రైతులకు తెలియపరిచారు వరికి ఎకరమునకు 168 రూపాయలు మాత్రమే చెల్లించి పంటకు బీమా చేసుకోవాల్సిందిగా తెలిపారు, తద్వారా పంట ఇబ్బంది జరిగిన సందర్భంలో ఈ యొక్క పంట బీమా ఉండడంవల్ల రైతులకి నష్టపరిహారం అందుతుంది.పంట బీమా తాను పంట వేసినట్లుగా నమోదు పత్రం పొంది ఈ సేవలో నమోదు చేసుకోవాలి, అలాగనే బ్యాంకు రుణాలు ద్వారా పంటలు వేసుకునే వారికి బ్యాంకు లోనే వారు పంట బీమా అందుతుంది, వరిలో కాండం నుంచి తొలుచు పురుగు ఎలా నివారించాలి తగు నివారణ జాగర్తలు గురించి వివరించారు. ఐదు ఎకరాలు కలిగిన వారు నవధాన్యాలు కిడ్స్ నీ ఉపయోగించడం చేయడం వల్ల భూమి సారవంతంగా మారుతుంది అలాగనే మంచి దిగుబడి ఇస్తుందని రైతులకు వివరించారు. చముడు పొలాలు ఉంటే జీలగ వేసుకోమనీ, అలాగేచముడు పొలాలలో నీరు నిలబడే పొలాల్లో జీలగ మాత్రమే బ్రతుకుతుందని వివరించారు. మెట్ట నేలలలో జనుము వేయమని చూచించారు.ఏ వ్యవసాయ ప్రతినిధి అయిన సరిగా మీకు సహకరించకపోయినా మీ సమస్యలు పట్టించుకోకపోయినా నా దృష్టికి తీసుకురండి తక్షణమే నేను మీ సమస్య పరిష్కరించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మీకు ఎల్లప్పుడూ నేను అందుబాటులోనే ఉంటాను అవసరమైతే రాత్రిపూట కూడా నేను మీకు సహాయ పడగలను అందుబాటులో ఉండగలను అని అన్నారు.ఈ కార్యక్రమంలో రైతుల విరివిగా ఉత్సాహంగా పాల్గొని వ్యవసాయ అధికారుల యొక్క విలువైన సూచనలు తీసుకున్నారు.ఏడిఓ నాగార్జునసాగర్, పెళ్లకూరు మండలం వ్యవసాయ అధికారి విజయభారతి, ఆర్ బి కే మనీ, వెటర్నరీ అసిస్టెంట్, రైతులు శ్రీపతి చంద్రయ్య, బడికాల వాసు, చెంచయ్య, కృష్ణమ్మ నాయుడు, రాజయ్య, మురళి తదితర పాల్గొన్నారు.

# సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమ్మె

## - మానవహారం ధర్నాతో నిరసన



**గుత్తి-సూర్య వాస్తవం,జులై 09:** గుత్తి దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమ్మె- మానవహారం ధర్నాతో నిరస న.గాంధీ సర్కిల్ నుంచి రాజీవ్ సర్కిల్ వరకు సాగిన ఈ ర్యాలీ గాంధీ సర్కిల్ వద్ద మానవహారం సభ జరిపారు.కేంద్ర కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా,కార్మిక హక్కు ల పరిరక్షణకు ఈ ర్యాలీ కీలక మ ద్దతుగా నిలిచింది.గుత్తిలో సీఐటీ యూ ఆధ్వర్యంలో మున్సిపల్ కా ర్మికుల సమ్మె – మానవహా రం,ధ ర్నా తో నిరసన.ఈ సందర్భంగా పలువురు కార్మిక సంఘాల నేత లు మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక కోడ్ల పై తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేశా రు.కార్మికుల సంక్షేమాన్ని హరించే లా ఈ కోడ్లు రూపొందించబడ్డాయని పేర్కొన్నారు.వాటిని తక్ష ణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ప్రధాన డి మాండ్లు కనీస వేతనం రూ.26,0 00గా నిర్ణయించాలని,స్కీం వర్క ర్లను రెగ్యులరైజ్ చేయాలని,ప్ర భుత్వ రంగ సంస్థల ప్రైవేటీ కర ణను వెంటనే నిలిపి వేయాలని ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగా లను వెంటనే భర్తీ చేయాలని కో రారు.కార్మికుల హక్కుల పరిరక్ష ణపై స్పష్టమైన సందేశంను గుత్తి ర్యాలీ ద్వారా వ్యక్తీకరించారు, ఈ కార్యక్రమంలో రైతు సంఘం నేత రామకృష్ణ,మహిళా సంఘం నాయకులు రేవతి,కార్యదర్శి మ ల్లికార్జున,డివైఎఫ్ఐ నాయకులు అశోక్ అలీ,చందు,గుత్తి మున్సి పాలిటీ ప్రతినిధులు సూర్య నారా యణ,రామాంజి,మున్సిపల్ ఇం జినీరింగ్ విభాగం నుంచి అధ్య క్షులు రాజా ఉపాధ్యక్షులు మురళి రాజ్కుమార్ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ సహాయ కార్యదర్శిలు నరసింహులు ఆదినారాయణ న క్క శేఖర్ కోశాధికారి,కా ర్మిక సభ్యులు,గుత్తి అంగన్వాడీ కార్యకర్తలు శోభ,నాగరత్న,పార్వ తి,ఆశ వర్కర్లు రోజా,విజయలక్ష్మి కలిసిన కాలనీ వాసులు,బీసీ కా లనీల ప్రజలు తదితరులు పాల్గొ న్నారు

# ప్రాణవాయువును ప్రసాదించే మొక్కలను ప్రతి ఒక్కరూ నాటాలి



**మదనపల్లి – సూర్య వాస్తవం, జూలై 9:**

మనిషికి ప్రాణ వాయువును ఇచ్చే మొక్కలను ప్రతి ఒక్కరూ నాటాలని ఏబీవీపీ అన్నమయ్య జిల్లా కన్వీనర్ సాయి హేతీష్ కోరారు. ఆ సంఘం సభ్యులతో మదనపల్లె శాఖ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ విద్యార్థి దినోత్సవం, ఏబీవీపీ 77వ ఆవిర్భావం దినోత్సవాన్ని జరుపుకున్నారు. రంగనాథ ఐటిఐ కాలేజీ ఆవరణలో ప్రిన్సిపల్ నరేంద్ర చేతుల మీదుగా మొక్కల నాటి మాట్లాడుతూ.. మనిషికి ప్రాణ వాయువును ఇచ్చేది మొక్కలే అన్నారు. అలాగే పర్యావరణాన్ని కాపాడేది మొక్కలే అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. మొక్కలను కాపాడడమే కాకుండా వాటిని నరకకుండా చూడాల్సిన గురుతర బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు ఏబీవీపీ సభ్యులు ఉన్నారు.

# ఎవరి పాలనలో రైతులకు మంచి జరిగిందో చర్చకు సిద్ధమా ?

## - జగన్‌కు మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు సవాల్



**శాంతీపురం- సూర్య వాస్తవం, జూలై 9:** గత వైయస్సార్సీపి ప్రభుత్వ పాలనలో మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి రైతులకు ఏం మేలు చేశారో చెప్పాలని మాజీ శాసనమండలి సభ్యులు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మాజీ టీటీడీ బోర్డు సభ్యులు గౌని వారి శ్రీనివాసులు ప్రశ్నించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఉండగా రైతాంగాన్ని విస్మరించి నేడు రైతులకు ఏదో అన్యాయం జరిగిందంటూ గగ్గోలు పెట్టడం జగన్ కు తగదని ఆయన హితవు పలికారు. జగన్ పాలనలో పంటలకు గిట్టుబాటు ధర లేదన్నారు. మరో వైపు పెరిగిన పెట్టుబడులతో వ్యవసాయం భారంగా మారిందని,అటువంటి పరిస్థితుల్లో అండగా ఉండవలసిన వైసీపీ ప్రభుత్వం ఎటువంటి సాయం అందించకపోవడంపై రైతులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. అందుకే జరిగిన ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతాంగానికి అవసరమైన వ్యవసాయ పరికరాల దగ్గర నుంచి వివిధ పథకాల ద్వారా రైతులపై విత్తనాలు, సబ్సిడీ పథకాలు, డ్రిప్ ఇరిగేషన్ ,ఉద్యాన పంటలకు ప్రోత్సాహకాలతో అన్నదాతలకు సహాయం అందించిందన్నారు.

**- ఉద్యాన పంటలకు దక్కని సాయం :** వైసీపీ అధికారంలో ఉండగా ఉద్యాన పంటలకు దాదాపుగా ప్రోత్సాహం కరువైందన్నారు. టీడీపీ హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో దాదాపుగా 13 రకాల పథకాల కింద రైతులకు పండ్ల తోటల పెంపకం, పామాయిల్, అరటి, జామ వంటి తోటలతో పాటు కూరగాయల పెంపకాలకు సాయం అందేది. ప్రతి రైతుకు కనీసం ఐదు ఎకరాలకు తక్కువ లేకుండా ఈ పథకాలకు రాయితీపై విత్తనాలు, ఉచితంగా ఎరువులు అందజేసేవారు. ఈ పథకాలకు అవసరమైన డ్రిప్ పరికరాలు కూడా ప్రభుత్వం 90శాతం రాయితీపై అందించేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అంతర్ పంటలు, కూరగాయల సాగు, ఉద్యాన పంటల రైతులకు రాయితీలు ఆగిపోయాయి. వారికి అందించే ఎరువుల సరఫరా కూడా నిలిచిపోయిందని విమర్శించారు. **డ్రిప్ సౌకర్యానికి కూడా ఇబ్బందులే:** వైసీపీ పాలనలో డ్రిప్ కంపెనీలకు ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో రైతులకు డ్రిప్ సౌకర్యం కూడా అందుబాటులో లేకుండా పోయిందన్నారు. డ్రిప్ కోసం దరఖాస్తు చేసిన రైతులకు కంపెనీల నుంచి స్పందన లేకపోవడంతో చాలామంది రైతులు తమ సొంత ఖర్చులతో డ్రిప్ సౌకర్యం ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఆర్థిక స్థోమత లేని రైతులు పంటలు వేయడం మానుకున్నారన్నారు. వ్యవసాయ పరికరాలు, యంత్రాల సరఫరా నిల్: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి అవసరమైన ట్రాక్టర్‌లు, మినీ టిల్లర్‌లు, దుక్కి దున్నే నాగలి సెట్‌లు, ఆయిల్ ఇంజిన్లు, మడత పైపులు, టార్పాలిన్లు, కూరగాయల పెంపకానికి ఉపయోగపడే క్రేట్‌లు, మినీ వ్యాన్లు, ఇతర వ్యవసాయ పరికరాలు రైతులకు సబ్సిడీపై అందించే వారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీకి కేవలం ఒకరిద్దరికి వ్యవసాయ పరికరాలు ఇచ్చి అదే అందరూ ఉపయోగించుకోవాలంటూ షరతులు పెట్టడంతో రైతులకు నిరాశే మిగిలిందని గుర్తు చేశారు. **జలకళ ఏమైంది జగన్:** ప్రతి రైతుకు వ్యవసాయ బోరుతో పాటు మోటారు, విద్యుత్ కనెక్షన్ ఉచితంగా ఇస్తామంటూ వై ఎస్సార్ జలకళతో హడావిడి చేసిన ప్రభుత్వం కేవలం నామమాత్రంగా బోర్లు తవ్వి ఊరుకుంది. రైతులకు ఇవ్వవలసిన వ్యవసాయ మోటార్లు కూడా దక్కలేదు. వీటిలో విద్యుత్ సౌకర్యం కూడా రైతులకు రాలేదు. దీంతో ఈ పథకం పూర్తిగా విఫలమైంది. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు రావలసిన ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇవ్వలేదని విమర్శించారు. **రీ సర్వేలో తప్పిదాలు, ఆందోళనలో అన్నదాతలు:** వైయస్సార్సీపి ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో భారీగా తప్పిదాలు, అవకతవకలు చోటు చేసుకోవడం అన్నదాతలను కుంగ దీసిందన్నారు. చాలా మండలాల్లో ఒకరి భూమిని మరొకరి ఖాతాలో వేసి రెవెన్యూ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. దీంతో గ్రామాల్లో భారీగా రీ సర్వే వివాదాలు పెరిగాయి. అవి ఇప్పటికీ పరిష్కారం కాలేదు. చాలా మంది రైతులు తమ భూమిని ఆన్‌లైన్ లోపాలు సరి చేసుకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఇదే సమయంలో పట్టాదారు పాసు పుస్తకాలపై సీఎం జగన్ ఫొటోలు ముద్రించడంతో ఇవి ప్రభుత్వానికి దాఖలు పడిపోతాయేమోనన్న ఆందోళన అన్నదాతలను పట్టి పీడించిందన్నారు. వ్యవసాయానికి నిరాటంకంగా నాణ్యమైన విద్యుత్ తొమ్మిది గంటల పాటు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఎక్కడా అమలుకాని పరిస్థితి నెలకొని ఉండేది అన్నారు.

**రైతు భరోసా కేంద్రాల సేవలు అంతంత మాత్రమే:** వైఎస్ఆర్సిపి ప్రభుత్వం గొప్పగా చెప్పుకున్న రైతు భరోసా కేంద్రాల సేవలు కూడా రైతులకు అక్కరకు రాని విధంగా అలంకారప్రాయంగా ఉండేదన్నారు. విత్తనాల పంపిణీ సమయంలో తప్పితే ఈ కేంద్రాల వద్ద ఒరిగేదేమీ లేకపోవడంతో అన్నదాతలు రైతు భరోసా కేంద్రాలపై భరోసా కోల్పోయారు. **సాగునీటి వనరులపై అంతులేని నిర్లక్ష్యం:**

సాగునీటి వనరులను వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేయడంతో వ్యవసాయానికి మేలు లభించక రైతులు నానా అవస్థలు పడ్డారన్నారు. ఏ కోణంలో చూసిన వైసీపీ ప్రభుత్వం రైతులకు చేసిన సహాయం ఏమీ లేదని ఈ విషయం రాష్ట్రంలోని రైతాంగానికి ప్రజలకు అందరికీ తెలిసిందేనన్నారు. నేడు మామిడి రైతుల పేరిట రాజకీయ డ్రామాలకు జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని అయనప్పటికి ప్రజలు, రైతులు నమ్మేస్థితిలో లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం సబ్సిడీ రూపంలో మామిడి రైతులను ఆదుకుంటుందని తీర జగన్మోహన్ రెడ్డి మామిడి కోత అయిపోయిన తర్వాత రైతులను ప్రమర్శించడానికి రావడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

# లేబర్ కోడ్లను రద్దు చేయాలి

## - కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి
## -పని గంటలు తగ్గించాలి, వేధింపులు ఆపాలి
## - సార్వత్రిక సమ్మెలో కదం తొక్కిన కార్మికులు




**మదనపల్లి – సూర్య వాస్తవం, జూలై 9:** కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను యాజమాన్యానికి అనుకూలంగా ఉండే లేబర్ కోడ్లుగా మార్చే దుర్మార్గపు ఆలోచనలను ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కార్మిక వర్గం దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా మదనపల్లెలో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపాలిటీ, అంగన్వాడి, ఆశ వర్కర్స్, హమాలీ వర్కర్స్, పంచాయతీ వర్కర్స్, ఎలక్ట్రసిటీ, బిఎస్ఎన్ఎల్, బ్యాంకింగ్ రంగం లోని తదితర కార్మికులు, ఉద్యోగులు దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని కదం తొక్కారు. సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం నుంచి బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటివరకు 22 సమ్మెలు జరిగాయని, అయితే నేటి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ప్రత్యేకత ఉందన్నారు. కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర దాగి ఉన్న లేబర్ కోడ్లను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చి, యాజమాన్యానికి అనుకూలంగా ఉండే విధానాలను పెద్ద ఎత్తున కేంద్ర ప్రభుత్వం చొప్పిస్తోందని ఇందుకు నిరసనగా పెద్ద ఎత్తున గొంతు విప్పాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కనీస వేతనాలు చట్టాన్ని రద్దుచేసి, సమ్మె హక్కును కాలరాస్తూ యజమానులకు అనుకూలమైన చట్టాన్ని కల్పించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతోందని, ఇది చాలా దారుణమన్నారు. ఇందువల్ల యజమానుల గుప్పట్లోకి అన్ని హక్కులు వెళ్లిపోతాయని, వారు అనుకున్న సమయంలో సంస్థను మూసివేయొచ్చని, వారు అనుకున్న విధంగా కార్మికులకు వేతనాలు ఇవ్వవచ్చని, ఎప్పుడైనా సరే కార్మికులను తొలగించే వెసులబాటు ఉందని, పని గంటలు పెంచడం లాంటి ఎన్నో అనుకూల పరిస్థితులు యజమాన్యానికే అనుకూలంగా ఉంటాయన్నారు. దేశమంటే అంబానీ, ఆదానీలే కాదని కార్మికులు, కష్టజీవులు, రైతులు, వ్యవసాయ కూలీలు అందరూ దేశంలో భాగమేనని గుర్తు చేశారు. వీరికి కనీస వేతనాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. నానాటికి ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ప్రజలు సైతం కార్మిక వర్గానికి మద్దతు ఇచ్చి, దేశ సంపద ప్రజలకే చేరేవిధంగా జరిగే ప్రజా ఉద్యమంలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి, మధురవాణి, సిఐటియు నాయకులు ప్రభాకర్ రెడ్డి, రామకృష్ణ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు జయమ్మ, సవిత, పంచాయతీ వర్కర్స్ నాయకులు గోపాల్, ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకులు నారాయణ, ఐటీయూసీ నాయకులు కృష్ణమూర్తి, అధిక సంఖ్యలో ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ వర్కర్స్, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

**అడుగడుగునా పోలీసు ఆంక్షలు :** కార్మిక వర్గం బుధవారం చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు అడుగడుగునా పోలీసులు ఆంక్షలు విధించారు. శాంతియుతంగా తమ గలాన్ని వినిపించేందుకు కార్మికులు చేపట్టిన శాంతి ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేశారు. సమ్మె కు అనుమతించాలని దరఖాస్తు చేయలేదని, తమను కాదని శాంతియుత ర్యాలీ చేస్తే అందరి పైన కేసులు బనాయిస్తామని బెదిరింపులకు దిగారు. దీంతో కొద్దిసేపు పోలీసులకు కార్మిక నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. చివరికి కార్మికులు అనుకున్న ప్రదేశం వరకూ కాకుండా కొంతమేర శాంతిర్యాలి చేపట్టి తమపై జరుగుతున్న అరాచకాలపై మండిపడ్డారు.

### లేబర్ కోడ్లును

# రద్దు చేసేంతవరకు పోరాటం ఆగదు: సిపిఎం

**పత్తికొండ టౌన్ -సూర్య వాస్తవం, జూలై 9:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్లు ను రద్దు చేసేంతవరకు పోరాటం కొన సాగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. రామచంద్రయ్య అన్నారు. బుధవారం దేశవ్యాప్తంగా 22వ సార్వత్రిక సమ్మె భాగంగా పత్తికొండ పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి సిఐటియు, ఏఐటియుసి, ట్రేడ్ యూనియన్, ప్రజాసంఘాలు నాయకులు, కార్యకర్తలు లేబర్ కోడ్లు రద్దు చేయాలి అంటూ నినాదంతో నాలుగు స్తంభాల మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఐటియు మండల కార్యదర్శి గోపాల్ ,ఎఐటియుసి రంగన్న అధ్యక్షతన బహిరంగ సభలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి రామచంద్రయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కార్మికులను, ప్రజానీకాన్ని మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తే సహించేది లేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కోసం తీసుకొచ్చిన నూతన 4 లేబర్ కోడ్లు ను రద్దుచేసి పోరాడి సాధించుకున్న 44 లేబర్ కోడ్లు ను కొనసాగించేంతవరకు పోరాటం చేస్తామని అన్నారు. 8 గంటల పని విధానం కోసం బదులుగా 10 గంటలు పెంచడం దుర్మార్గం చర్య అన్నారు.అంగన్వాడి టీచర్లకు కనీస వేతనం ,ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర రావాలంటే స్వామినాథ మిషన్ సిఫారసు ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలను మోసం చేస్తే ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కార్మిక హక్కులను రద్దు చేయకపోతే రాబోయే రోజుల్లో కార్మికులు, కర్షకులు, రైతులు, ప్రజా సంఘాలు ,ట్రేడ్ యూనియన్లు కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి రాజా సాహెబ్, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఎన్ కృష్ణ, సిపిఎం మండల కమిటీ సభ్యులు దస్తగిరి, రంగారెడ్డి, గంగన్న, సిఐటియు నాయకులు ఎం .రవిచంద్ర, , తదితరులు పాల్గొన్నారు.







### వివిధ ప్రాజెక్టులకు ప్రభుత్వ భూముల

# కేటాయింపులు త్వరితగతిన పూర్తి కావాలి

## - జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జులై 09 :** – లిజిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించి ప్రభుత్వ భూముల కేటాయింపులు త్వరితగతిన పూర్తి కావాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ సెక్టార్ పై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓలు, జిల్లా రిజిస్టర్, డీఎస్ఓ, తహసిల్దార్ లు, ఆర్ఎస్డిటిలు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి 544డికి సంబంధించి తాడిపత్రి మండలంలో అధిక శాతం భూమి సేకరణ పెండింగ్ ఉందని, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు వారంలోగా పంపించాలన్నారు. ఈ విషయమై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సోలార్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించి యాడికి మండలంలో కొంత ప్రభుత్వ భూమిని అప్పగించడం జరగగా, మిగతా భూమికి సంబంధించి రెండు వారాల్లోపు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఏపీఐఐసికి సంబ ంధించి గార్లదిన్నె మండలం కనుంపల్లి గ్రామంలో అర్హులైన పట్టదారులకు ఆర్డీఓ ద్వారా నష్టపరిహారం చెల్లించాలని, ఇందుకు సంబంధించి రెండు రోజులలోపు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధికారులు దృష్టిపెట్టాలని, సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, కలెక్టరేట్ రిసెప్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, డిఎస్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## భూ సమస్యలను పరిష్కరించండి

### - రెవెన్యూ అధికారులకు వేడుకోలు



**తంబళ్లపల్లి -సూర్య వాస్తవం:** తంబళ్లపల్లె నియోజకవర్గం కురబల కోట మండలంలో భూతగాదాలతో అన్నదమ్ముల మధ్య తలెత్తిన ఘర్షణ గత ఆరు సంవత్సరాలుగా పరస్పర దాడులకు దారి తీస్తోంది. జూన్ 10 వతేది ఒకసారి, ఈనెల 6వ తేదీ మరోసారి పరస్పరం దాడులు జరిగాయి. మొదటి దాడిలో ఓ మహిళ గాయపడగా తాజాగా జరిగిన దాడితో మనస్తాపం చెందిన చంద్ర శేఖర్ రెడ్డి విషం తాగి ప్రాణాపాయ స్థితినుండీ తప్పించుకున్నాడు. బాదితుల కథనం మేరకు.. కురబలకోట మండలం, నందిరెడ్డిగారిపల్లి పంచాయతీ, బండపల్లి కి చెందిన శ్రీనివాసులురెడ్డి, వెంకటరామి రెడ్డి లు అన్నదమ్ములు. వీరికి గ్రామంలో 872/3, 872/7, 872/5 సర్వే నెంబర్లలో 7.10 ఎకరాల పొలం ఉంది. అయితే అన్నదమ్ముల మధ్య బాగ పరిష్కారం కాకపోవడంతో పలుమార్లు గొడవలు జరిగాయి. ఈనెల ఆరవ తేది ఒక వర్గం వారు కర్రలు, రాడ్లతో సామికొండ సమీపంలోని తమ వ్యవసాయ క్షేత్రం వద్దకు చేరుకుని అక్కడ ఉన్న ఆవులు, కుక్కలపై దాడి చేస్తుండగా అడ్డుకున్నారన్నారు. గత ఆరు సంవత్సరాలుగా గొడవలు జరుగుతున్నాయని రెవిన్యూ రికార్డుల ప్రకారం సర్వే చేసి గొడవలకు స్వస్తి పలకాలని బాదితులు వెంకట్రమణ రెడ్డి, లక్ష్మి దేవి, వారి ఇద్దరు కుమారులు చంద్రశేఖర్ రెడ్డి, శివ కృష్ణా రెడ్డి లు వాపోతున్నారు.

## కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై అంగన్వాడీల సమ్మె సార్వత్రిక సమ్మె



**చెన్నూరు,-సూర్య వాస్తవం, జులై 9:** దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు సిపిఎం సిపిఐ పార్టీలు భారత్ బంద్ పిలుపునివ్వడంతో బుధవారం చెన్నూరు మండల వ్యాప్తంగా అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు బందుకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా మండల కేంద్రమైన చెన్నూరు తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఉదయం ధర్నా చేపట్టారు. అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్తలు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 26 వేల కనీస వేతనం కేటాయించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో అన్ని మ్యాపులను రద్దు చేయాలని అలాగే పేస్ మ్యాప్ కూడా రద్దు చేయాలని కోరారు. 5సంవత్సరాల పిల్లలను అంగన్వాడి కేంద్రాల్లోని ఉండే విధంగా జీవో తీసుకురావాలని కోరారు. అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అంగన్వాడీ కార్యకర్తలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం మండల తాసిల్దార్ సరస్వతి కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తులసమ్మ .పద్మ .రాధా . గుర్రమ్మ. లక్ష్మీదేవి అనేకమంది అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

## రెచ్చిపోయిన దొంగలు..

### - ఒకే రోజు 20 లారీలకు బ్యాటరీలు, డీజల్ చోరీ...



**మదనపల్లి – సూర్య వాస్తవం, జూలై 9:** మదనపల్లెలో దొంగలు రెచ్చి పోయారు. నిలబెట్టి ఉన్న 20 లారీలకు బ్యాటరీలు డీజిల్ను చోరీ చేశారు. బుధవారం మదనపల్లెలో వెలుగు చూసిన ఘటనకు సంబంధించి బాధితులు రెండవ పట్టణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా, మదనపల్లె పట్టణం, కదిరి రోడ్డులోని టమోటా మార్కెట్ యార్డ్ కు సమీపాన ఉండే టిప్పు సుల్తాన్ మైదానంలో నిలిపిన 20 లారీలలో డీజిల్, బ్యాటరీలను దొంగలు రాత్రి చోరీ చేయడంతో బాదితులు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నీరుగట్టుపల్లెలో కాపురం ఉండే లారీల యజమానులు గంగాధర రెడ్డి, సుబ్బారెడ్డి, అశోక్ కుమార్ తదితరులు లారీలను టిప్పు సుల్తాన్ మైదానంలో నిలిపి, బాడుగులకు తిప్పు తుంటారు. బాడుగులు లేని సమయంలో లారీలను టిప్పు సుల్తాన్ మైదానంలో నిలబెట్టి ఉండడాన్ని గమనించిన దొంగలు అర్ధ రాత్రి లారీల బ్యాటరీలు, డీజిల్ చోరీ చేశారు. చోరీ పై 2టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా స్పందించిన సీఐ రామచంద్ర, ఎస్సై రహిముల్లా వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )